

ఘనంగా అంబేడ్కర్ జయంతి



హార్బర్‌కు చేరిన బోట్లు

నేటి నుంచి చేపల వేట బంద్

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేట సోమవారం అర్ధరాత్రితో నిలిచిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తూర్పు తీరంలో ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వేటకు విరామం ప్రకటించారు. మత్స్య సంపద పరిరక్షణ, పునరుత్పత్తి, నిర్వహణ కోసం ఈ నిషేధం అమలు చేస్తున్నట్టు విశాఖ జిల్లా మత్స్య శాఖ అధికారులు సోమవారం తెలిపారు. మోటారు బోట్లు, ఇంజిన్ బోట్లు ఏవీ వేటకు వెళ్లకూడదని స్పష్టంచేశారు. నిషేధం నేపథ్యంలో వేటకు వెళ్లిన బోట్లలో దాదాపు 70 శాతం ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్నాయి. మిగిలినవి కూడా తిరుగు ప్రయాణంలో ఉన్నాయని, 24 గంటల్లో వచ్చేస్తాయని మత్స్యకార నాయకులు తెలిపారు.



భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ఉద్యోగులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

నెలాఖరు వరకూ 50 శాతం వడ్డీ రాయితీ

- ఆస్తి పన్ను బకాయిలదారులకు ప్రభుత్వం అవకాశం
- ఈ ఏడాది పన్ను ఒకేసారి చెల్లిస్తే 5% రిబేటు

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలను ఒకేసారి చెల్లించే వారికి వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వడానికి నిర్దేశించిన గడువును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. గత నెల 31తో గడువు ముగిసినప్పటికీ బకాయిదారుల నుంచి స్పందన పెరుగుతుందనే భావనతో ఈనెల 30 వరకూ అవకాశం ఇచ్చింది. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఒకేసారి చెల్లించిన వారికి ఐదు శాతం రిబేటు ప్రకటించింది. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఎస్.శ్రీనివాసరావు కోరారు.

ఉక్కు ఉద్యోగుల మెడపై కత్తి

రోజుకు 12 గంటలు పని

- 16 నుంచి కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె నేపథ్యంలో ఉద్యోగులకు స్టీల్‌ప్లాంటు యాజమాన్యం నోటీస్
- వరుసపెట్టి హెచ్ఆర్ నుంచి ఉత్తర్వులు
- నెలాఖరు వరకూ సెలవులు రద్దు
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో ఉద్యోగుల మెడపై కత్తి పెట్టి పని చేయించే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేసిన తరువాత ప్లాంటు ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని, రెండు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా పూర్తి ఉత్పత్తి చేస్తున్నామని ఒక వైపు ప్రకటిస్తూనే ఉద్యోగులు ఇంకా పనిచేయాల్సి ఉందని చెబుతోంది. మరో వైపు కాంట్రాక్టు కార్మికుల సంఖ్య భారీగా తగ్గిస్తోంది. ఇటీవల 1,500 మందిని వివిధ కారణాలతో తొలగించింది. మరో రెండు వేల మందిని ఆపేయాలని జాబితా రూపొందించింది. ఈ చర్యలను నిరసిస్తూ ఈ నెల 16వ తేదీ నుంచి 13,000 మంది కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. యాజమాన్యానికి నోటీసు కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఉన్న ఉద్యోగులు పది వేల మందితో పూర్తి ఉత్పత్తి చేయించాలని యాజమాన్యం నిర్ణయించింది.



సాధారణంగా వేలాది మంది సమ్మె చేసినప్పుడు ఉత్పత్తిపై ప్రభావం ఉంటుంది. కొన్ని విభాగాలు మూతపడతాయి. వాటిని కనీస స్థాయిలో నడిపే ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. అయితే యాజమాన్యం 13 వేల మంది విధులకు రాకపోయినా సరే ఉత్పత్తిలో ఎటువంటి తేడా ఉండకూడదని, వారి పనిని మిగిలిన ఉద్యోగులు చేయాలని ఆదేశించింది. ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎవరూ సెలవులు పెట్టకూడదని మూడు రోజుల క్రితం మానవ వనరుల విభాగం (హెచ్ఆర్) ఉత్తర్వులు జారీచేసింది. రెండు రోజుల క్రితం మరో ఉత్తర్వు జారీ చేసింది. ప్రస్తుతం ప్లాంటులో రోజుకు ఎనిమిది గంటల పని విధానం నడుస్తోందని, సమ్మె నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోజుకు 12 గంటలు పనిచేయాలని, పూర్తి ఉత్పత్తికి సహకరించాలని పేర్కొంది. ఇవి చాలవన్నట్టు సోమవారం ఇంకో ఉత్తర్వు జారీ చేసింది. విధులకు హాజరయ్యే ఉద్యోగులు వారి షిఫ్ట్ పూర్తయ్యేంత వరకు ఆ విభాగంలోనే ఉండాలని, పని ప్రాంతం వదిలి ఇతర విభాగాలకు గాని, బయటకు గాని వెళ్లకూడదని స్పష్టంచేసింది. కొంతమంది విధులకు వచ్చినట్టు హాజరు వేసుకొని మెయిన్ గేట్ నుంచి వెళ్లిపోతున్నారని ఆరోపించింది. పని చేసే ప్రాంతంలో ఉద్యోగులు లేనట్టయితే దానిని సీరియస్‌గా పరిగణించి సర్వీసు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

సీఆర్ఎస్ జాబితా పెంచడానికే...

స్వచ్ఛంద పదవీ విరమణ ద్వారా అనుకున్న స్థాయిలో ఉద్యోగులను ఇంటికి పంపడం వీలు కానుందన, ఇప్పుడు క్రమ శిక్షణ చర్యల ద్వారా 'తప్పనిసరి పదవీ విరమణ' (సీఆర్ఎస్) చేయించడానికి ఈ నిబంధనలన్నీ ... మిగతా 6వ పేజీలో

టీచర్ల బదిలీలకు రంగం సిద్ధం

నెలాఖరులో హెచ్ఎంల బదిలీలు

- వచ్చే నెలలో స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు
- అనంతరం బదిలీలు
- ఉమ్మడి జిల్లాలో 1,000 నుంచి 1,200 మందికి స్థానచలనం

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు పాఠశాల విద్యా శాఖ రంగం సిద్ధం చేస్తోంది. పదోన్నతులకు ఇప్పటికే సీనియారిటీ జాబితా రూపొందించిన విద్యా శాఖ వాటిపై పలు దఫాలుగా అభ్యంతరాలు స్వీకరించింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాపరంగా తయారుచేసిన సీనియారిటీ జాబితాపై ఇంకా పలు ఆరోపణలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా జడ్పీ పరిధిలో స్కూల్ అసిస్టెంట్లు, హెచ్ఎం పదోన్నతుల కోసం రూపొందించిన జాబితాలపై, ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్ఎంల పదోన్నతుల ... మిగతా 6వ పేజీలో

వెబ్‌సైట్‌లో హెచ్ఎంల పదోన్నతుల సీనియారిటీ జాబితా

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ జోన్ పరిధిలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్ పోస్టు నుంచి గెజిటెడ్ గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కోసం రూపొందించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను 'ఆర్‌జేడీఎస్ఈవీఎస్‌పీ.కామ్' వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పాఠశాల విద్యాశాఖ విశాఖ ప్రాంతీయ సంచాలకుడు బి.విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ జాబితాపై ఈనెల 19వ తేదీ సాయంత్రంలోగా అభ్యంతరాలు తెలపాలని కోరారు. అన్ని ఆధారాలతో అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు.

గ్రేటర్‌లో కాంట్రాక్టర్ హవా

యూజీడీ టెండర్లలో చక్రం తిప్పుతున్న వైనం

- రూ.20 కోట్ల విలువైన పనులకు బిడ్లు పిలిచేందుకు సిద్ధమైన అధికారులు
- ఒక్కొక్కరికీ మూడింటికి మాత్రమే అవకాశం ఇవ్వాలని ఈఈకి సదరు కాంట్రాక్టర్ ఆదేశం
- ఆ మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపిన ఇంజనీర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీలోని భూగర్భ డ్రైనేజీ (యూజీడీ), నీటి సరఫరా విభాగంలో ఒక కాంట్రాక్టర్ చక్రం తిప్పుతున్నారు. విభాగంలో సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వంటి ఉన్నతాధికారులు ఉన్నప్పటికీ ఆ కాంట్రాక్టరే అంతా తానై వ్యవహరిస్తున్నారు. ఆ విభాగంలో సుమారు రూ.20 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచేందుకు అధికారులు సన్నద్ధం కాగా, ఒక్కో కాంట్రాక్టర్‌కు మూడేసి వర్కులు చొప్పున పంచేయాలని సూచించారు. అధికారులు కూడా సదరు కాంట్రాక్టర్ చెప్పినట్టుగానే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్టు ప్రచారం జరుగుతోంది.



నగరంలో నీటి సరఫరా, యూజీడీ నిర్వహణకు సంబంధించి సుమారు రూ.20 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచేందుకు ఆ విభాగాల బాధ్యతలు చూస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) స్థాయి అధికారి అంచనాలు తయారుచేశారు. నీటి సరఫరా, యూజీడీ విభాగాల్లో పనులకు జీవీఎంసీ పరిధిలోని కాంట్రాక్టర్లలో 15 నుంచి 20 మంది మాత్రమే టెండర్లు వేస్తుంటారు. వారిలో యూనియన్ పేరుతో ఇటీవలకాలంలో హడావుడి చేస్తున్న ఒక కాంట్రాక్టర్ ఆ విభాగంలోని అధికారులను తన గుప్పిట్లో పెట్టుకుని వ్యవహారాలను చక్కబెడుతున్నారు. కాంట్రాక్టర్ల నుంచి పర్సంటేజీలు వసూలు చేయడంతోపాటు సందర్భాన్ని బట్టి అధికారులకు పార్టీలు ఇవ్వడం, పిక్నిక్‌ల పేరుతో ట్రీట్‌లు ఇవ్వడం చేస్తుండడంతో అధికారులు కూడా ఆయనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. త్వరలో రూ.20 కోట్లు విలువైన 75కి పైగా పనులకు టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమైనట్టు సదరు కాంట్రాక్టర్ తెలిసింది. ఒక్కోపనికి విడివిడిగా కాంట్రాక్టర్లు అందరూ టెండర్లు వేస్తుండడంతో భారీ లెస్‌లకు వెళ్లిపోతున్నాయని, అలాకాకుండా ఒక కాంట్రాక్టర్‌కు మూడేసి వర్కులు చొప్పున పంచి పెట్టేయాలని ఇంజనీరింగ్ అధికారికి సూచించారు. ఎవరికి వారు టెండర్ వేసేయకుండా, ఒక్కొక్కరు మూడు వర్కులకు మాత్రమే టెండర్ వేసేలా తాను చూసుకుంటానన్నారు. దీనివల్ల అందరికీ వర్కులు దొరకడంతోపాటు గరిష్ఠంగా ఐదు, పది శాతానికి మించి లెస్‌లకు వెళ్లే అవకాశం ఉండదని, కాంట్రాక్టర్లకు కూడా భారీగా డబ్బులు మిగులుతాయని అధికారులకు వివరించారు. కాంట్రాక్టర్లపై పట్టు కలిగిన వ్యక్తి ... మిగతా 6వ పేజీలో

పరీక్షల నిర్వహణ గాడిన పడేనా?

21 నుంచి ఏయూ దూరవిద్య ఎగ్జామ్స్

ఈమధ్య నిర్వహించిన పరీక్షల్లో అనేక చోట్ల మాస్ కాపీయింగ్

- 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో విచారణకు కమిటీ
- 'డిస్టెన్స్ ఎడ్యుకేషన్'లో చక్రం తిప్పుతున్న చిరు ఉద్యోగి
- అబ్జర్వర్ల నియామక బాధ్యతలు అతడివే
- ఇప్పటికే భారీగా ముడుపులు దండినట్టు ప్రచారం

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని దూర విద్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే పలు కోర్సులకు ఈ నెల 21వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు నిర్వహించే కొన్ని కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరుగుతోందనే విమర్శలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఇటీవల జరిగిన పీజీ పరీక్షల్లోనూ మాస్ కాపీయింగ్ జరిగింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. స్పందించిన వర్సిటీ అధికారులు ఒక కమిటీని కూడా వేశారు. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మళ్లీ పరీక్షలు ప్రారంభమవుతుండడంతో మరోసారి మాస్ కాపీయింగ్ అంశం తెరపైకి వచ్చింది.



ఈ నెల 21 నుంచి 25 వరకూ డిగ్రీ, పీజీ విద్యార్థులకు మొదటి సెమిస్టర్, ఎంబీఏ విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్నారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు అబ్జర్వర్లను నియమిస్తుంటారు. వీరి నియామకాన్ని ఇక్కడ పనిచేసే ఒక చిన్న ఉద్యోగి నిర్ణయిస్తుండడం విశేషం. ఇందుకోసం ఆయా కాలేజీల నుంచి భారీగానే ముడుపులు వసూలు చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి. దూర విద్యలో ఆ చిరు ఉద్యోగికి తెలియకుండా ఏమీ జరగదు.

విచారణ తూతూ మంత్రమేనా.?

దూరవిద్య పరీక్ష కేంద్రాలు క్రమంగా పెంచుకుంటూ వచ్చారు. ఇందుకు అనేక కాలేజీలు భారీగానే ముట్టజెప్పాయన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనేక కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ యథేచ్ఛగా సాగుతోంది. కొన్నిచోట్ల పరీక్షలను విద్యార్థులకు బదులుగా ఇతరులతో రాయిస్తున్నారు. గత నెలాఖరు నుంచి ఈ నెల మొదటి వారం వరకు జరిగిన పరీక్షల్లోనూ కొన్ని కేంద్రాల్లో పెద్దఎత్తున మాస్ కాపీయింగ్ జరిగింది. దీనికి సంబంధించి 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏయూ వీసీ ప్రొఫెసర్ ... మిగతా 6వ పేజీలో

దారుణం

- మరికొద్ది గంటల్లో ప్రసవం కానున్న భార్యను గొంతునులిపి చంపిన కిరాతకుడు

మరికొద్ది గంటల్లో ప్రసవం కానున్న భార్యను గొంతు నులిపి చంపేశాడో కిరాతకుడు. ప్రేమించి పెళ్లి చేసుకున్న అతను...ఆ విషయం తన తల్లిదండ్రులకు ఎక్కడ తెలుస్తుందోననే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు సమాచారం. భార్యను, ఆమెతోపాటు కడుపులో ఉన్న బిడ్డను సైతం పొట్టన పెట్టుకున్న నరరూప రాక్షసుడిని పీఎం పాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. - వివరాలు మెయిన్‌లో



జ్ఞానేశ్వర్, అనూష (ఫైల్ ఫొటో)

సరియాలో ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యం

- వెలికితీసిన ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్, స్థానికులు

-వివరాలు 8లో...

అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని సరియా జలపాతంలో ఆదివారం సాయంత్రం స్నానానికి దిగి గల్లంతైన విశాఖపట్నానికి చెందిన ఇద్దరు యువకులు మృతదేహాలు సోమవారం లభ్యమయ్యాయి.

వైసీపీకి బెహరా గుడ్‌బై

- త్వరలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిక

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరొక నేత గుడ్‌బై చెప్పేశారు. పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ మండల అధ్యక్షునిగా పనిచేస్తున్న బెహరా భాస్కరరావు పార్టీ పదవితో పాటు సభ్యత్వానికి రాజీనామా చేసి, జనసేనలో చేరుతున్నట్టు సోమవారం ప్రకటించారు. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశిస్తూ ఒక లేఖను విడుదల చేశారు.



బెహరాతో ఎమ్మెల్యేలు వెలగపూడి, వంశీకృష్ణ, టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాస్

బెహరా భాస్కరరావు కొంతకాలం కిందటివరకూ జీవీఎంసీలో కో-ఆప్షన్ సభ్యుడిగా పనిచేశారు. ఆయన భార్య, కోడలు ప్రస్తుతం కార్పొరేటర్లుగా ఉన్నారు. ఇదిలావుండగా ఇటీవల మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వగా ఈనెల 19న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేస్తున్నట్టు ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ప్రకటించారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి కనీసం 74 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే కూటమికి ... మిగతా 6వ పేజీలో



కొమ్మాదిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



భీమునిపట్నం : సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



పద్మనాభం : బీఆర్ తాళ్లవలసలో జరిగిన వేడుకల్లో జనసేన నాయకుడు సందీప్, ఏఎంసీ చైర్మన్ రామిస్వామినాయుడు

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- నియోజకవర్గంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి

భీమునిపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను యువత కొనసాగించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో జరిగిన అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కలెక్టర్‌కు విద్యార్థులు జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్, తహసీల్దార్ రామారావు,సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు రామారావు, ఏఎస్‌డబ్ల్యూ రమాదేవి తదితరులు పాల్గొన్నారు. డైట్ జంక్షన్‌లో టీడీపీ నాయకులు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు,ఎంపీడీవో హనుమంతరావు, ఏవో నగేశ్, సాయినాథ్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు జలగడుగుల మురళి, సీహెచ్ రమణ, కె.నాగరాజు, ఎం. సంజీవకుమార్, జి.పోలిరాజు, నూకరాజు, ఎస్. జోగారావు పాల్గొన్నారు.అలాగే వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనపర్తి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో మండల కార్యాలయం, డైట్ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మైలపల్లి షణ్ముఖరావు, అల్లిపిల్లి నరసింగరావు, పి.ఎర్రయ్యరెడ్డి, కె.ఎల్లాజి, వి.కొండబాబు, జి. మధునాయుడు, కె. రామ సూరప్పడు, ఆర్. ప్రభాకరనాయుడు, బి. రమణారెడ్డి పాల్గొన్నారు. కొండపేటలో వున్న అంబేడ్కర్ విగ్రహానికి ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిత్రపు శ్రీనివాసరావు మాదిగ, కొండపేట గ్రామస్థులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

సాగర్‌నగర్ : గీతం యూనివర్సిటీలోనూ అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. స్కూల్ ఆఫ్ లా ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మణరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ లా ఇన్‌ఛార్జి డీన్ ప్రొఫెసర్ ఎ. రాజేంద్రప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జె. ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు ఎస్సీ ఎస్టీ కాలనీలో టీడీపీ నాయకుడు వేజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మధురవాడ : యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని ఏడో వార్డు టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కలివేల్పు సూరిబాబు పిలుపునిచ్చారు. మల్లయ్యపాలెం, శ్రీలక్ష్మీనగర్‌లో ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాత మధురవాడ మెట్టు వద్ద జైభీమ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రావాడ సీతారామ్, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

తగరపువలస : తగరపువలసలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు.బంగ్లామెట్టలో జరిగిన కార్యక్రమానికి సోమి అప్పలరాజు అధ్యక్షత వహించారు. వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, అధికార ప్రతినిధి హరి కిరణ్, నాయకులు వెంపాడ రమణ, తమ్మిన అశోక్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిట్టివలస ఫుట్‌బాల్ మైదానంలో దళిత కులాల సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పతివాడ రాంబాబు, బాగం గోపాలరావు, సత్తిరాజు, అప్పారావు, గంటాన మోహనరావు పాల్గొన్నారు.



సింహాచలంలో నివాళి అర్పిస్తున్న ఈఓ సుబ్బారావు

కొమ్మాది : జీవీఎంసీ ఆరో వార్డు పరిధిలోని సేవానగర్‌లో జరిగిన వేడుకల్లో రాష్ట్ర పద్మ శాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్, గొల్లంగ ఆనందబాబు, లోడగల జానకీరామ్, సేవానగర్ ప్రతినిధి భరత్‌కుమార్, తది తరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పరదేశిపాలెం అంబేడ్కర్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 5వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, దళిత సంఘాల నాయకులు కుడితిరామారావు, సియాద్రి కనకరాజు పాల్గొన్నారు. జోన్-2 కార్యాలయం వద్ద పోతిన హనుమంతురావు, పోతిన శ్రీనివాసరావు, వంకాయల మారుతీ ప్రసాద్, పిల్లా సూరిబాబు, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. బక్కన్నపాలెం 16వ బెటాలియన్‌లో జరిగిన వేడుకల్లో కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

సింహాచలం : సింహాచలం దేవస్థానంలో ఈఓ సుబ్బారావు తన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. విజినిగిరిపాలెంలోని కమ్యూనిటీ భవనంలో జరిగిన కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ సారథ్యంలో పలువురు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. పాత అడివివరం అంబేడ్కర్ కాలనీకి చెందిన నవ దళిత యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అడివివరం సహకార పరపతి సంఘం పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలు చల్లి, దేశానికి ఆయన చేసిన సేవలను శ్లాఘించారు.

ఆనందపురం : వేములవలస జంక్షన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అప్పలసూరి, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, బహుజన సమాజ్‌వాది పార్టీ సీనియర్ నాయకుడు భాగం గోపాలరావు పూలమాల వేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు ఉప్పాడ సీతారాం, చెన్నా సత్యం, కోరాడ అప్పలస్వామినాయుడు, చందక సూరిబాబు, పిన్నింటి రమణ, ఇల్లాపు వెంకట జగన్, కోరాడ రాంబాబు, బంక శ్రీను పాల్గొన్నారు. పెద్దిపాలెంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, సర్పంచ్ బి. భారతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఎం. పద్మజ, న్యాయవాది ఎం. చిన్మయ్యపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం రూరల్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ అన్నారు. రెడ్డిపల్లి, పద్మనాభం, పాండ్రంగి గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షురాలు టి. నాగమణి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, మత్స సోమేశ్వరరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. రెడ్డిపల్లి, పద్మనాభంలో జరిగిన వేడుకల్లో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఈర్లె ఈశ్వరరావు, ఎంపీపీ కె. రాంబాబు, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, ఉప సర్పంచ్ ఎస్. ఆదిబాబు, ఏబీవీపీ నాయకులు గణేష్, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విలాస్‌ఖాన్‌పాలెంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్వర్యంలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని రిటైర్డు ఉద్యోగి కె. ముత్యాలు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యవతి, సన్యాసినాయుడు, శ్రీను పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ తాళ్లవలసలో వేడుకలు నిరహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, భీమిలి ఏఎంసీ చైర్మన్ కె. రామస్వామినాయుడు, రమణ పాల్గొన్నారు.



అందం.. ఆహ్లాదం

ఎండాడ - రుషికొండ డబుల్ రోడ్డులో డివైడర్ మధ్యలో వేసిన కాగితపు పూలు విరగబూసాయి. తెలుపు, గులాబీ రంగుల్లో ఉన్న పూలు రహదారిలో ప్రయాణించే వారిని అమితంగా ఆకర్షిస్తున్నాయి. అలాగే ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే వారికి ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తున్నాయి. కాగితపు పూలు వద్ద కొందరు వాహనదారులు సెల్ఫీలు దిగుతూ ఆనందం పొందుతున్నారు. - ఎండాడ, ఆంధ్రజ్యోతి



ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డులో విరగబూసిన కాగితపు పూలు

టీచర్ల బదిలీలకు రంగం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

జాబితాపై అభ్యంతరాలు తెలిపేందుకు ఈ నెల 19వ తేదీ గడువిచ్చారు. అభ్యంతరాలు స్వీకరించిన తరువాత వాటిని పరిష్కరించనున్నారు. ఈ నెలాఖరున ఉమ్మడి జిల్లాలో హెచ్ఎం లకు బదిలీలు ఉంటాయి. ఆ తరువాత వచ్చే నెలలో పోస్టుల ఖాళీల (సుమారు 30 వరకూ ఉన్నాయి) మేరకు స్కూల్ అసిస్టెంట్ లకు కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్ఎంలుగా పదోన్నతులు ఇవ్వనున్నారు. ఆ తరువాత స్కూలు అసిస్టెంట్ టీచర్ల బదిలీలు చేపడతారు. అనంతరం సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించి, వారికి బదిలీలు చేపడతారు. కాగా ఈ పర్యాయం భారీగా స్థాన చలనం కలగనున్నదంటున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2017లో భారీగా బదిలీలు జరిగాయి. అప్పట్లో బదిలీలు జరిగిన స్కూల్ అసిస్టెంట్, సెకండరీగ్రేడ్ టీచర్లంతా ఒకేచోట ఎనిమిదేళ్లు పూర్తిచేసుకున్నారు. అందువల్ల విధిగా వీరికి ఆయా చోట్ల నుంచి స్థాన చలనం కలుగుతుంది. ఈ నేపథ్యంలో 1,000 నుంచి 1,200 మంది టీచర్లకు బదిలీలు జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు అంచనా వేస్తున్నాయి.

గ్రేటర్‌లో కాంట్రాక్టర్ హవా

... 5వ పేజీ తరువాయి

కావడంతోపాటు తమకు కూడా అన్ని విధాలుగా సహకరిస్తుండడంతో సంబంధిత అధికారి సరేనని తలూపారు. కాంట్రాక్టర్లందరికీ న్యాయం జరిగేలా ఒక్కో కాంట్రాక్టర్ గరిష్ఠంగా మూడు వర్కులు మాత్రమే చేయాలని, అంతకుమించి వర్కులు దక్కినా సరే వర్క్ ఆర్డర్ ఇచ్చేది లేదని షరతు పెడుతూ ప్రతిపాదనలను తయారుచేసి చీఫ్ ఇంజనీర్ ఆమోదానికి పంపించారు. దానిని పరిశీలించి చీఫ్ ఇంజనీర్ వివాదానికి దారితీస్తుందనే ఉద్దేశంతో పెండింగ్‌లో పెట్టినట్టు సమాచారం. ఈ వ్యవహారం జీవీఎంసీలో తెలిసిపోవడంతో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఒక కాంట్రాక్టర్ చెప్పినట్టు అధికారులు చేయడం ఆశ్చర్యంగా ఉందని, కాంట్రాక్టర్ల మధ్య పోటీ తగ్గిపోతే తక్కువ లెస్‌లకు వర్కులు వెళ్లిపోవడం వల్ల నగర పాలక సంస్థకు నష్టం జరుగుతుందని అంటున్నారు.

పరీక్షల నిర్వహణ గాడిన పడేనా?

... 5వ పేజీ తరువాయి

జీపీ రాజశేఖర్ విచారణకు కమిటీని వేశారు. సైన్స్ కాలేజీ పిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు సారథ్యంలో ఏర్పాటైన కమిటీ విచారణ జరుపుతోంది.ఈ కమిటీ కొత్తవలసలోని వాగ్దేవి కాలేజీపై మాత్రమే విచారణ జరుపుతోంది. మిగిలిన కాలేజీల్లో వ్యవహారాలపై దృష్టిసారించడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 80 కేంద్రాల్లో మూడొంతుల సెంటర్లలో ఇదే తరహాలో పరీక్షలను నిర్వహిస్తున్నారు. కొత్తవలసలో మరో కాలేజీతోపాటు గజపతినగరం, తాడేపల్లిగూడెం, ఎస్.కోట, సబ్బవరం, పాయకరావుపేట, నర్సీపట్నం, అనంతపురంలోని కేంద్రాలపైనా ఆరోపణలు వచ్చాయి. గోదావరి జిల్లాల్లోని ఒక కాలేజీలో పరీక్షల నిర్వహణకు భవనాలు లేవు. కానీ అక్కడ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రక్షాళన చేస్తారా?

ఏయూ దూరవిద్యను ప్రక్షాళన చేయాలని పలువురు పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన సిబ్బందితో సమస్యలున్నాయని ఉన్నతాధికారులే చెబుతున్నారు. కొందరి సీట్లు మార్చాలని ఆయన కోరినా గత ఇన్‌చార్జి వీసీ పట్టించుకోలేదు. ప్రస్తుత వీసీ జీపీ రాజశేఖర్ దృష్టిసారిస్తే మరిన్ని వ్యవహారాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు.

వైసీపీకి బెహరా గుడ్‌బై

... 5వ పేజీ తరువాయి

ప్రస్తుతం 73 మంది బలమే ఉండడంతో పాటు తమతో ఉన్న కొందరి తీరుపై నేతలకు అనుమానాలు ఉండడంతో మరింత మంది మద్దతు కూడగట్టుకోవాలని నిర్ణయించారు. అందులో భాగంగానే బెహరా భాస్కరరావుతో కూటమి నేతలు గతకొద్దిరోజులుగా సంప్రతింపులు జరుపుతున్నారు. టీడీపీలో ఆయన్ను చేర్చుకునేందుకు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అభ్యంతరం చెప్పడంతో జనసేనలోకి తీసుకోవాలని నిర్ణయించినట్టు ప్రచారం జరిగింది. జనసేనలో చేరాలంటే తనకు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించాలని బెహరా షరతుపెట్టినట్టు సమాచారం. అందుకు జనసేన పశ్చిమ నియోజకవర్గ నేతలు ససేమిరా అనడంతో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ గత రెండు రోజులుగా బెహరాతోపాటు జనసేన అధిష్ఠానంతో చర్చలు జరిపారు. ఇవి సోమవారానికి ఒక కొలిక్కి రావడంతో బెహరా వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో బెహరా కుటుంబంలోని ఇద్దరు కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయనున్నారు. దీంతో కూటమి నేతలు ఊపిరిపీల్చుకుంటున్నారు.

ఉక్కు ఉద్యోగుల మెడపై కత్తి

... 5వ పేజీ తరువాయి

కొత్తగా అమలులోకి తెస్తున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. తమను ఎంత వేధించాలని చూసినా కాంట్రాక్టు కార్మికుల తొలగింపును అంగీకరించబోమని, వారికి నిరవధిక సమ్మెకు అండగా ఉంటామని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. ప్రతి ఉద్యోగి రోజుకు 12 గంటలు పనిచేయాలని చెబుతున్నారని, ప్లాంటు లోపల ఉత్పత్తి సమయంలో వందల డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుందని...అటువంటిచోట్ల 12 గంటలు ఎలా పనిచేయగలుగుతామని ఆయా విభాగాల ఉద్యోగులు వాపోతున్నారు.

క్రమశిక్షణతో లక్ష్య సాధన : సీపీ

సీతంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మానవ హక్కుల మండలి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి విచ్చేసి విద్యార్థులకు పలు అంశాలపై సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని, లక్ష్యసాధన దిశగా అన్ని అంశాల్లో అవగాహన పెంచుకొని ముందుకు సాగాలన్నారు. కౌన్సిల్‌కి చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

‘రిజర్వేషన్ల అమలులో అన్యాయం’

సింహాచలం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవదాయ శాఖలో రిజర్వేషన్ల అమలు సక్రమంగా లేదని ఆశాఖ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డీవీఎస్ రామరాజు (హరి) అన్నారు. సోమవారం ఆయన ఈఓ కార్యాలయంలో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో మాట్లాడారు. వివిధ ఆలయాల పరిధిలో పదోన్నతులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో రోస్టర్ విధానం పూర్తిగా పట్టించుకోవడం మానేశారన్నారు. పదేళ్లుగా అనేక పోస్టులు బ్యాక్‌లాగ్ ఉన్నాయని, వాటిని భర్తీ చేయడంలో అధికారులు కనీస శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ఆలయాల్లో వైదికపరమైన, నాదస్వరం, డోలు వంటి పోస్టుల విషయంలో తొలుత తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు కమిషనర్ స్థాయిలో జరిపి వాళ్ల సర్వీసు రెండేళ్లు కాగానే క్రమబద్ధీకరిస్తున్నారని, అలాగే మిగతా పోస్టుల విషయంలో ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యవర్గ సమావేశంలో చర్చించి, మే 1 నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని తెలిపారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి కర్ణాటకలోని బళ్లారి ప్రాంతానికి చెందిన ఆర్. ధీరష్ చంద్ర రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,01,000లను నగదు రూపంలో సోమవారం ఆయన దేవాలయ పర్యవేక్షణాధికారులు పద్మనాభరాజు, ప్రసాద్‌కు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాతకు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించారు.

టీటీడీ అన్న ప్రసాద ట్రస్టుకు ...

తగరపువలస : తగరపువలసకు చెందిన కాళ్ల గురునాయుడు కుటుంబ సభ్యులు అతని పేరుతో తిరుమలలోని అన్న ప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళంగా అందించారు. ట్రస్టు సభ్యులకు సోమవారం వారు ఈ చెక్కును తమ నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కాళ్ల శ్రీనివాసరావు, పురుషోత్తం, మద్దిల పద్మావతి, కాళ్ల విమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు పార్లమెంట్ ఆమోదించడాన్ని ఆవాజ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ప్రధాన కార్యదర్శి అశ్రఫ్ తెలిపారు. సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చట్టం రాజ్యాంగంపై, మైనార్టీల హక్కులపై దాడి చేస్తోందన్నారు. సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పద్మనాభం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : పాండ్రంగి గ్రామానికి చెందిన రైతులకు అధికారులు ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు విద్యాసాగర్, హేమసుందర్ మాట్లాడుతూ తక్కువ యాజమాన్య ఖర్చులతో రైతులకు అధిక ఆదాయంతో పాటు ఆరోగ్యకరమైన పంటలు పండించడానికి ప్రకృతి సేద్యం దోహదపడుతుందని చెప్పారు. రైతులు ఖరీఫ్ కంటే ముందు నవధాన్యాలు వేసి భూమిని సారవంతం చేయాలన్నారు. అనంతరం ఆదర్శ రైతులు అప్పలనారాయణ, శ్రీకృష్ణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పల్లి మహేశ్, పిన్నింటి రమణ, మహంతి అప్పలరమణ, తదితరులు పాల్గొన్నారు.

మట్టి పాత్రలకు గిరాకీ



తగరపువలస సంతలో విక్రయానికి ఉంచిన పాత్రలు

తగరపువలస, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో చాలా మంది మట్టి పాత్రలు వినియోగిస్తున్నారు. దీంతో వీటి అమ్మకాలు పెరిగాయి. తగరపువలసలోని కుమ్మరి వీధికి చెందిన పలువురు వివిధ రకాల మట్టి పాత్రలను తయారు చేసి సంతలో విక్రయిస్తున్నారు. కుండలు, ప్రమిదలతో పాటు వాడుకకు వినియోగించే పాత్రలు కూడా అమ్ముతున్నారు. ఇళ్లల్లో పూలు పెంచుకోవడానికి కుండీలను కూడా మట్టితోనే తయారు చేస్తున్నారు. వేసవిలో మట్టి కుండల్లో నీటిని తాగడం మంచిదని వైద్యులు చెబుతుండడంతో చాలామంది వాటిని కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్ దృష్ట్యా కుండల్లో కూడా రకరకాలు అందిస్తున్నారు. ప్రస్తుతం కూజాల మాదిరిగా ఉన్న వాటికి గిరాకీ ఉంది.

గ్రావెల్ అక్రమంగా తరలిస్తే చర్యలు

ఎండాడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ టీటీడీ వెనుక భాగంలో ఉన్న కొండలను భారీ యంత్రాలతో తవ్వి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో సోమవారం అక్రమ తరలింపును అడ్డుకున్నారు. ఇవే కొండలపై (బచ్చలకొండ) రాజీవ్ గృహ కల్ప పేరుతో గత ప్రభుత్వం హౌసింగ్ బోర్డు ద్వారా ప్లాట్‌లు వేసింది. ఈమేరకు కొండల మధ్య నుంచి రోడ్లు వేశారు. ఇది అక్రమార్కులకు వరంగా మారింది. రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతి లేకుండా రాత్రి వేళ కొండలను తవ్వి గ్రావెల్ తరలిస్తూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు వీఆర్ఓ వెంకటేశ్ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి అనుమతి లేకపోవడంతో తరలింపును అడ్డుకున్నారు.

వేట నిషేధంతో తీరానికి చేరిన బోట్లు



నాగమయ్యపాలెం తీరంలో పడవలు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి చేపల వేటకు విరామం ప్రకటించడంతో మత్స్యకారులు మర పడవలు, బోట్లును తీరానికి చేర్చారు. రెండు నెలల పాటు తీరంలో కదలకుండా తాళ్లతో కట్టి ఉంచారు. జూన్ 15న మళ్లీ ఈ పడవలు సముద్రంలోకి వెళతాయి. మండలంలో అన్నవరం, నాగమయ్యపాలెం, పాతపాలెం, ఆశిపాలెం, మూలకుద్దు గ్రామాల్లో సుమారు 680 మర పడవలు ఉన్నాయి. వీటితో మత్స్యకారులు చేపల వేటకు వెళ్తుంటారు. వేటకు వెళితే వారం, పది రోజుల పాటు తిరిగిరారు. వేట విరామాన్ని ఈనెల 14న అర్ధరాత్రి నుంచి అమలు చేస్తారని తెలిసి మత్స్యకారులు దూర ప్రాంతాల నుంచి తీరానికి చేరుకున్నారు. పడవలను సురక్షిత ప్రాంతాలకు చేర్చారు.

బాక్సింగ్ విజేతలకు బహుమతులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర (అబా) ఏడో రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల విజేతలకు సోమవారం సాయంత్రం కైలాసపురం మధుసూదన్‌నగర్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ బహుమతులను అంద చేశారు. వీఎన్ విశాఖ బాక్సింగ్ అసోసియేషన్, సిటీ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 90 మంది బాక్సర్లు పాల్గొన్నారు. సుధాకర్ మాట్లాడుతూ ఆత్మరక్షణకు బాక్సింగ్ తోడ్పడుతుందని చెప్పారు. టోర్నమెంట్ విజేతలు ఈ నెల 25 నుంచి 28 వరకూ హైదరాబాద్‌లో జరిగే బీడీఎఫ్ఐ జాతీయ పోటీల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం నిర్వాహకులను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాం, ప్రధాన కార్యదర్శి అమ్మోరు, ఎస్‌పీటీఈ పోర్టు వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్, పోర్టు యూనియన్ నాయకుడు గొర్లె చందు, ఐబీ శ్రీనివాస్, బి కంకరాజు, అనిల్‌కుమార్, పాల్గొన్నారు.

నిత్యం నీటితో కళకళ

- కుమ్మరిపాలెంలో డచ్ వారి హయాంలో నిర్మించిన బావి
- జీవీఎంసీ ట్యాంకర్లకు ఇదే ఆధారం

తగరపువలస, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలకు కొన్నేళ్ల క్రితం వరకూ నేల బావులే తాగునీటికి, వ్యవసాయానికి ఆధారం. మోటార్లు అందుబాటులోకి వచ్చిన తరువాత అనేక ప్రాంతాల్లో బావులు పూడికపోగా, కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న వారు మూసి వేస్తున్నారు. వ్యవసాయ భూముల్లో కూడా సబ్ మోటార్లు వచ్చాక వీటి వినియోగం దాదాపుగా తగ్గిపోయింది.కానీ జీవీఎంసీ రెండో వార్డు కుమ్మరిపాలెం సమీపంలో ఉన్న బావి మాత్రం మండు టెండల్లో కూడా నిత్యం నీటితో కళకళ లాడుతోంది. ఈ బావి సుమారు 50 అడుగుల లోతు ఉండగా, గట్టుపై నుంచి పది అడుగుల లోపు నీరు అందుతుంది. ఇక్కడి రైతులు భూ ములన్నీ అమ్మేసినా ఈ బావిని మాత్రం మూసి వేయకుండా ఉంచారు. పండగల సమయంలో గ్రామాల్లో వాడుక నీటి కోసం జీవీ ఎంసీ ట్యాంకర్లు ఇక్కడి నుంచే నీటిని నింపుకె ళ్తుంటాయి. గత పదేళ్లుగా ప్రతి వేసవిలోనూ వారు ఈ నీటిని ఉపయోగిస్తున్నారు. ఇక్కడికి సమీపంలో డచ్ అధికారుల సమాధులు కూడా ఉన్నాయి. ఒకప్పుడు వారు ఈ ప్రాంతంలో నివశించేవారని, దీన్ని వారే తవ్వించి ఉంటారని స్థానికులు చెబుతున్నారు.



కుమ్మరిపాలెంలో బావి

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీకాలనీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైనట్లు కేసు నమోదయ్యింది. సీఐ మురళీ తెలిపిన వివరాలు మేరకు.. పాత వెంకోజీపాలెం గవర వీధికి చెందిన యువతి (18) ఈనెల 8న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. యువతికి పరిచయమైన ఓ యువకుడిపై తమకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఎంవీపీకాలనీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురయ్యింది. శివాజీపాలెం లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న కొల్లి హేమకుమార్ ఫిబ్రవరి 22న తన ఇంటి ముందు ఏపీ 31 డిజె 2313 నెంబరు గల బుల్లెట్ వాహనం నిలిపి ఉంచారు. మరుసటి రోజు ఉదయం ఆ వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ధనుంజయనాయుడు కేసు నమోదు చేసి నేర విభాగానికి బదిలీ చేశారు.

అన్న సమారాధన

ఆరిలోవ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ జయంతి సందర్భంగా బీఎస్‌ఆర్ నగర్‌లో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఎస్‌సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బుడుమూరు గోవింద్, ఒమ్మి పోలారావు, బలగ సుధాకర్, కేతా సత్యనారాయణ, మామిడి మోహన్, కొండమ్మ, తులసీ పార్వతి పాల్గొన్నారు.

అయ్యప్పకు పూజలు

ఆరిలోవ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి జన్మదినం పురస్కరించుకొని చినగదిలి నార్త్ షిర్డి సాయిబాబా ఆలయ ఆవరణలో స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ చీఫ్ ట్రస్టీ వానపల్లి అప్పారావు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతం, ఇతర అభిషేకాలు చేశారు.

అలరించిన నాటక ప్రదర్శన



నాటకోత్సవాలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పైడా కౌషిక్ నాటకోత్సవాల్లో భాగంగా పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో సోమవారం ప్రదర్శించిన నాటక ప్రదర్శనలు అలరించాయి. గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ సంస్థ కళాకారులు ప్రదర్శించిన 'ఇది అతని సంతకం' నాటకం సందేశాత్మకంగా సాగింది.నిర్దిష్టమైన ప్రణాళికతో లక్ష్యాలు ఎలా సాధించారనే కథతో చక్కగా సాగింది. రెండవ నాటకం జనరల్ భోగీలు కొలకలూరు వారధిలో రైల్వేలో ఎదుర్కొంటున్న సమస్యలపై ఉత్తరాల ఉద్యమం చేసిన సావిత్రమ్మ ప్రదర్శనకు ప్రేక్షకులు కరతాళధ్వనులు చేశారు. నాటకోత్సవాల నిర్వాహకులు మంతెన సత్యనారాయణరాజు, గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

● గుడ్, బ్యాడ్, అగ్లీ : శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)

● జాక్ : జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),

● రాబిన్‌హుడ్ : శ్రీలీలామహల్, గోకుల్,

● మ్యాడ్ : జగదాంబ, శరత్, కన్య (గాజువాక)

● పెళ్ళికాని ప్రసాద్ :శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), వ కౌర్య (గోపాలపట్నం), తాతా(తగరపువలస)

కోర్ట్ : జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 19, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 28, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12,క్యారెట్ 30 దొండకాయలు 20, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది)48, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 62, దోసకాయ 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 36, కంద 64,దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240



వెంకోజీపాలెం : ఏయూలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వీసీ రాజశేఖర్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది



ఆరిలోవ : పెదగదిలి జంక్షన్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే రామకృష్ణబాబు



జీవీఎంసీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న అధికారులు

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

» ఎంపీ శ్రీభరత్
» తూర్పు నియోజకవర్గంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి
» పలుచోట్ల దుస్తులు పంపిణీ

ఆరిలోవ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మేధావులలో అంబేడ్కర్ ఒకరని విశాఖ ఎంపీ భరత్ శ్లాఘించారు.పెదగదిలి జంక్షనులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అందరూ నడవాలని ఎంపీ అన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నాయకులు ఒమ్మి సన్యాసిరావు. బుడుమూరు, గాడి సత్యం తదితరులు పాల్గొన్నారు.11వ వార్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు, సీపీఐ నగర కార్యదర్శి ఎస్‌కె రెహమాన్, శ్రీకృష్ణాపురంలోని గురుకులంలో ప్రిన్సిపాల్ రత్నవల్లి పూలమాల వేసి నివాళులర్పించారు.

సిరిపురం : దేశానికి అంబేడ్కర్ అందించిన సేవలు ఎనలేనివని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ అన్నారు. వీఎంఆర్‌డీఏ భవన్‌లో ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ తొలి న్యాయశాఖ మంత్రిగా, రాజ్యాంగ శిల్పిగా కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారన్నారు. దళితుల సామాజిక, రాజకీయ హక్కులు, కులవివక్ష నిర్మూలన కోసం ఎంతగానో పాటుపడ్డారన్నారు. చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ హరిప్రసాద్, పరిపాలనాధికారులు నాగభూషణం, రమణ, విద్యాసాగర్, అరుణవల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత : వీసీ

వెంకోజీపాలెం : రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ శ్లాఘించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని న్యాయ కళాశాల, పరిపాలన భవనం వద్ద అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ అసెంబ్లీ మందిరంలో నిర్వహించిన సమావేశంలో వీసీ పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం సందేశమిచ్చారు. దేశ యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారన్నారు. అకుంఠిత దీక్షతో ఉన్నత శిఖరాలను ఆయన అధిరోహించారని చెప్పారు. ఓర్పు, సహనం, త్యాగం వంటి లక్షణాలను అంబేడ్కర్ నుంచి నేర్చుకోవాలని చెప్పారు. కవితను స్వయంగా రాసి సభలో ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ చదివి వినిపించారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య బళ్ల అప్పారావు, రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు. అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని ఏయూ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎంప్లాయిస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి. షారాన్ రాజు. వీసీ రాజ శేఖర్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్. కిశోర్‌బాబు,ప్రిన్సిపాళ్లు ఎ. నరసింహారావు, ఎంవీఆర్ రాజు, జి. శశిభూషణరావు, కె. సీతామాణిక్యం, గిరిజా శంకర్, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్యాలయంలో...

అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉద్యోగులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భీమిలి జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ (రిటైర్డ్) ఎన్.రవి, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, అడ్మినిస్ట్రేషన్ అధికారి అప్పలనాయుడు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే రెల్లివీధిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్‌రుద్ర మాట్లాడుతూ భారత సమాజానికి పరిచయం అక్కరలేని మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. అంతరాలు లేని సమాజం కోసం తన జీవితాన్ని ధారపోసిన ఉత్తముడు అన్నారు. హెచ్‌బీకాలనీ జంక్షన్‌లో జరిగిన వేడుకల్లో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడారు. ఏయూలో భిన్నత్వంలో సమానత్వపు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, కోడి అర్జునుడు, ఉండ్రకొండ హరీశ్ పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు వివిధ ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదర్శనగర్ వద్ద జనసేన, తెదేపా నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సత్య పద్మ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ ప్రాంగణంలోని ప్రగతి భవన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉషోదయ కూడలిలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో వ్యాసరచన పోటీల్లో విజేతలకు సీనియర్ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు బహుమతులు అందచేశారు.

ఆర్‌టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో...

ద్వారకాబస్‌స్టేషన్ : ఆర్‌టీసీ ద్వారకా బస్‌స్టేషన్ ఆర్‌ఎం కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా జరిగింది. రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిమ్నకులాల అభ్యున్నతికి అంబేడ్కర్ నిరంతరం కృషి చేశారన్నారు. సమాజంలో అసమానతలను తొలగించేందుకు పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె. రాజశేఖర్, విశాఖ డిపో మేనేజర్ కె. గంగాధర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీటీఎంకే రాజు, అసిస్టెంట్ మేనేజర్ కమర్షియల్ ఎన్. బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.



వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథన్

ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో

నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం రామ్మోహన్ భవన్‌లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు, తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కేఎస్ఎన్ మూర్తి, డివిజనల్ కార్యదర్శి ఏకే శివాజీ, మద్దిలపాలెం డిపో అధ్యక్ష, కార్యదర్శులు పి చిన్న, ఎం.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రామ్‌నగర్ : జీవీఎంసీ 28వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సీనియర్ నాయకుడు నక్కా కనకరాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు, టీఎన్‌టీయూసి నాయకులు అప్పలనారాయణ, డిల్లీశ్వరి, శ్యామల, కళ్యాణి పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

మద్దిలపాలెం : పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత నేత డాక్టర్ అంబేడ్కర్ అని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలను జగన్ కొనసాగించారన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా అవతరించిందన్నారు. ఎమ్మెల్సీ పండు రవీంద్రబాబు, నాయకులు రవిరెడ్డి, తైనాల విజయకుమార్, జమీర్ అహ్మద్, పేడాడ రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎంపీ బాబూరావు, ఎమ్మెల్సీలు కల్యాణి, రవీంద్రబాబు



ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అధికారులు, సిబ్బంది


క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీపై మేధో చర్చ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీపై సోమవారం ఆన్లైన్ రౌండ్ టేబుల్ మేధో చర్చ నిర్వహించారు. ఐఐటీ ఖరగ్‌పూర్ కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుదేబ్ కుమార్ ప్రశాంత్ పాల్ వర్చువల్ విధానంలో హాజరయ్యారు. క్వాంటం సైన్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ, విభిన్న విభాగాలు సమష్టిగా కలిసి పని చేయాలని సూచించారు. ఏయూ చొరవను చూపుతూ నిపుణులు ఒకే వేదికపైకి తీసుకొచ్చి మేధో చర్చ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఉన్నత విద్యా మండలి సైతం క్వాంటం సైన్స్‌కు ప్రాధాన్యత కల్పించాలని సూచించినట్టు తెలిపారు. విద్యార్థులకు అవగాహన కల్పించడం,పరిశోధకులను చైతన్యవంతం చేయడం, దీనికి అనుగుణంగా, మౌలికపరమైన వ్యవస్థ నిర్మించడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, జేఎన్‌టీయూహెచ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. విశ్వనాథరావు, పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ విశాల్ గోయల్, వర్సిటీ ఆఫ్ హైదరాబాద్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ రుక్మారేఖ పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డాగా ఫిషింగ్ హార్బర్

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఫిషింగ్ హార్బర్ ఆకతాయిలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఎప్పుడూ చెత్తాచెదారం, మురుగు నీటితో అధ్వానంగా ఉండే ఈ ప్రాంతంలో స్వచ్ఛభారత్ అమలుతో ఓ కొత్తరూపు వచ్చింది. అయితే కొత్తగా రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిపోయింది. పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు ఆకతాయిలు అల్లరి చేష్టలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడ నివసిస్తున్న వారంతా మత్స్యకారులు. చేపల వేటే జీవనాధారం. పగలంతా వేట సాగించి, రాత్రి అయ్యేసరికి రెచ్చిపోతున్నారు. ఫిషింగ్ హార్బర్ సమీపంలో మద్యం దుకాణాలు రెండు ఉన్నాయి.తెల్లవారుజామున నాలుగు గంటలకే ఈ దుకాణాలు తెరుస్తుండడంతో మందు బాబులు ఇక్కడ తిష్ట వేసి రోడ్లపై చిందులేస్తున్నారు. మరికొంతమంది దారినపోయే మహిళల పట్ల అనుచితంగా ప్రవరిస్తున్నారు. చీకటి పడిన తరువాత యువకులు కార్లు, ద్విచక్ర వాహనాల్లోనూ ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో మద్యం తాగుతూ మత్తులో మితిమీరి ప్రవరిస్తున్నారు. మద్యం దుకాణాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా మూసివేయాలి. కానీ దుకాణ యజమానులు అర్ధరాత్రి వరకు విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఆ తర్వాత కూడా ముందుభాగంలోని షట్టర్ మూసివేసి ఉన్నా వెనుక నుంచి మద్యం విక్రయిస్తున్నారు. ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతుండడంతో మందుబాబుల రద్దీ ఇక్కడ ఎక్కువగానే ఉంటుంది. ఈ కూడలిలో రాకపోకలు సాగించే వాహనాలకు అడ్డంగా మందుబాబులు వచ్చి వీరంగం సృష్టిస్తుంటారు. ఈ ప్రాంతం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ ఏం జరిగినా పోలీసులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

వాల్తేరు రైల్వే అంతర్గత ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులతో ధ్యానచంద్ అవార్డీ ఉష, తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తూర్పు కోస్తా రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న అంతర్గత ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ సోమవారం ప్రారంభమైంది. రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ పోటీలకు ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత ఎన్.ఉష ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు రైల్వే ఫుట్‌బాల్ ప్రతినిధులు శ్రీనివాసరావు, తిరుమలరావు, గణేష్, రాజన్న, కన్నబాబు పాల్గొన్నారు. తొలి రోజు జరిగిన తొలి మ్యాచ్‌లో క్యారేజ్ అండ్ వ్యాగన్స్ (సీ అండ్ డబ్ల్యు) 3-0 గోల్స్ తేడాతో ఎలక్ట్రికల్ జనరల్‌పై విజయం సాధించారు. మరో మ్యాచ్‌లో ఇంజనీరింగ్ 2-0 గోల్స్‌తో డీజిల్ లోకోషెడ్‌పై గెలుపొందింది.

గార్బేజ్ వాహనం ఢీకొని మహిళ దుర్మరణం



మహారాణిపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళను చెత్త తరలించే వాహనం ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సోమవారం రాత్రి సుమారు 9.45 గంటల సమయంలో ఆర్‌టీసీ కాంప్లెక్సు నుంచి జగదాంబ జంక్షన్ వెళ్తున్న జీవీఎంసీ గార్బేజ్ వాహనం వెళ్తోంది. అదే రహదారిలో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చుని యల్లబిల్లి లావణ్య (27) వెళ్తోంది. సింగ్ హోటల్ జంక్షన్ వద్దకు చేరుకునేసరికి జీవీఎంసీ వాహనం ఢీకొట్టడంతో లావణ్య చక్రాల కింద నలిగిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, డ్రైవర్ ఆళ్ళ శంకరరావును అదుపులోకి తీసుకున్నారు.

18న టీచర్ల ఉద్యోగోన్నతి జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఆరిలోవ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతి జాబితాలో అభ్యంతరాలను ఈనెల 18వ తేదీన స్వీకరిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల నుంచి స్కూలు అసిస్టెంట్ల ఉద్యోగోన్నతి కోసం సబ్జెక్టుల వారీగా తాత్కాలిక సీనియారిటీ జాబితా ప్రచురించామన్నారు. అభ్యంతరం తెలిపే ఉపాధ్యాయుల పేర్లు, ప్రస్తుత కేడర్, ఎక్కడ పని చేస్తున్నారు. తదితతర వివరాలు 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీఈవో కార్యాలయంలో తెలియజేయాలన్నారు. డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచిన సంబంధిత ఫార్మాట్‌లో అభ్యంతరాలు తెలియజేయాల్సి ఉంటుందని, సీనియారిటీ జాబితాలో తప్పులు ఎక్కడ ఉన్నాయో స్పష్టంగా పేర్కొనాలని, ఆధారాలు జత చేయాలన్నారు. గడువు తరువాత అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోమన్నారు.

19 వరకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు..

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ జోన్ పరిధిలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్ నుంచి గజిటెడ్ గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగాన్నతి కోసం రూపొందించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను 'ఆర్‌జేడీఎస్‌ఈవీఎస్‌పీ.కామ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకుడు బి.విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై ఈనెల 19వ తేదీ సాయంత్రంలోగా అన్ని ఆధారాలతో అభ్యంతరాలు తెలపాలని కోరారు.

20న అన్నమాచార్య కీర్తనల పోటీలు

మురళీనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రుతిలయ భక్తి సంగీత సేవాసంస్థ నిర్వహణలో ఈ నెల 20న అన్నమాచార్య కీర్తనల పోటీల్ని నిర్వహించనున్నట్లు సేవా సంస్థ వ్యవస్థాపకులు వి.ప్రభాకర్ తెలిపారు. మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో పోటీల నిర్వహణ విశేషాల పోస్టర్‌ను ఆలయ ప్రధాన అర్చకులు జి.శేషాచార్య స్వామి తదితరులు సోమవారం ఆవిష్కరించారు. నగరంలోని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 20న ఉదయం 10 గంటలకు పోటీలు ఆరంభిస్తామన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్ విభాగాలుగా పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనేవారు 92466 22563 ఫోన్ నంబరులో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

'డ్రైవర్‌ను వాల్తేరు డిపోలోనే కొనసాగించాలి'


పెదవాల్తేరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు ఆర్టీసీ డిపో డ్రైవరు వీసీహెచ్ శేఖర్ అక్రమ సస్పెన్షన్, హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి తదుపరి డిపో పోస్టింగ్‌కు వీఓ డైరెక్ట్ చేసే విధానాన్ని నిరసిస్తూ పీటీడీ వైఎస్‌ఆర్ ఎంప్లాయిస్ కార్యాలయం వద్ద సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, వైఎస్‌ఆర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మద్దతు తెలిపాయి. మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు నిరాహార దీక్షను ప్రారంభించి మాట్లాడుతూ శేఖర్‌పై చర్యలు అక్రమమని, వాల్తేరు డిపోలోనే విధులు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మానవ హక్కుల కమిషన్ జోక్యం చేసుకుంటుందని తెలిపారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షురాలు ఎ.సీతాలక్ష్మి, వైఎస్‌ఆర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రావు, పీటీడీ వైఎస్‌ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఎంతః రావు, లోవరాజు,అసోసియేషన్ డిపో అధ్యక్షులు డిఎస్ బాబు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సభ్యులు

క్రీడల ఖిల్లాగా విశాఖను తీర్చిదిద్దుతాం

- జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు హర్షవర్ధన్‌ప్రసాద్

సిరిపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : క్రీడల ఖిల్లాగా విశాఖ జిల్లాను తీర్చిదిద్దుతామని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు టి. హర్షవర్ధన్ ప్రసాద్ అన్నారు. సోమవారం సిరిపురంలోని ఓ హోటల్‌లో నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-2029 కాలానికి గాను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్ల ఎన్నిక జరిగిందన్నారు. వివిధ విభాగాలకు చెందిన మొత్తం 33 క్రీడా సంఘాలు పాల్గొన్న ఈ ఎన్నికకు సీనియర్ కౌన్సిల్ జె. ప్రిట్ హెచ్‌వీరాజు, న్యాయవాది బీవీ కుమార్ రిటర్నింగ్ అండ్ అసిస్టెంట్ రిటర్నిర్ అధికారులుగా వ్యవహరించారన్నారు. ఈ ఎన్నిలకు ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కేపీ రావు పరిశీలకుడిగా హాజరయ్యారన్నారు. కాగా నూతన అధ్యక్షుడిగా హర్షవర్ధన్ ప్రసాద్, కార్యదర్శిగా ఎస్‌పీ లలిత్‌కుమార్ ఎన్నికయ్యారు. అసోసియేసన్‌లో వాలీబాల్ విభాగానికి చైర్మన్‌గా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, రెజ్లింగ్ విభాగానికి చీఫ్ పాట్రన్‌గా టి. శివశంకర్‌ను నియమించారు.

రాజ్యాంగం మన దేశానికి గర్వకారణం

» డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు ప్రముఖుల నివాళి » ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో ఘనంగా జయంతి వేడుకలు » టీడీపీ, బీజేపీ, జనసేన కార్యాలయాల్లో సందడి



కాన్వెంట్ జంక్షన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోర్టు అథారిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు తదితరులు



తాటిచెట్లపాలెం సంజీవయ్య కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎంపీ శ్రీభరత్



బీజేపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరుల నివాళి



జనసేన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరుల నివాళి

దండవేస్తున్న [illegible]





కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తిరుపతి ఆర్జేడీ నిర్మల్ కుమార్ ప్రియ, అధికారులు



జిల్లా టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి తదితరులు

విశాఖపట్నం/డాబాగార్డెన్స్/మహారాణిపేట/జ్ఞానాపురం/సీతమ్మధార/కంచరపాలెం/మాధవధార/అక్కయ్యపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలోని అనేక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నాయకత్వంలో రూపొందిన రాజ్యాంగం దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందని విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. కాన్వెంట్ జంక్షన్‌లో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాత డీసీఐ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టనున్నట్టు ప్రకటించారు. ప్రతిభావంత విద్యార్థులకు ఫెలోషిప్ మంజూరు చేస్తామన్నారు. డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేశ్‌కుమార్ దుబే, ప్రధాన విజిలెన్స్ అధికారి పీఎస్ఎల్ స్వామి, విభాగాధిపతులు పాల్గొన్నారు. పోర్టు ఎస్సీ ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. నీలమ్మ వేపచెట్టు వద్ద జీకే ఫౌండేషన్ ప్రతినిధులు బి.గోపీకృష్ణ, ఆకులరాజు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. భీమ్ సేన వార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేకు కోశారు. టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బి.గోవింద్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పొలమరశెట్టి శ్రీనివాసరావు, వెల్లంకి భరత్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని బీజేపీ నగర అధ్యక్షుడు పరుశరామరాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత ఆశయాలకు భిన్నంగా మోదీ పాలన సాగుతోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, సభ్యురాలు అత్తిలి విమల పాల్గొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని సాంకేతిక శాఖ తిరుపతి ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ ఆవిష్కరించారు. ప్రిన్సిపాళ్లు డా.కె.నారాయణరావు,డా.కె.వి.రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, వైద్యులు, బీమ్‌నగర్‌లో కార్పొరేటర్ కుందుల నాగరాజులు నివాళులర్పించారు. మాధవధార వైసీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పైడి శ్రీను, కె.శ్యామ్, అక్కయ్యపాలెం పరిధిలోని శాంతినగర్, కస్తూరినగర్‌లో దళిత సంఘాల నాయకులు నివాళులర్పించారు. కొన్ని ప్రాంతాల్లో మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభించారు.

నిరుపయోగంగా వాణిజ్య సముదాయం

» కంచరపాలెంలో మూడు దశాబ్దాలుగా అధికారులు పట్టించుకోని తీరు



ఫ్లైఓవర్ కింద నిర్మించిన వాణిజ్య సముదాయం

కంచరపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నిర్మాణాలు చేపట్టి తమ పని అయిపోయిందని వదిలేయడంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. కంచరపాలెం ఫ్లైఓవర్ (బ్రిడ్జి) వద్ద మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన వాణిజ్య సముదాయం ఇందుకు ప్రబల నిదర్శనం. ఇక్కడ మెట్టు వద్ద చిరు వర్తకులు, తోపుడు బండ్లు, బుట్టలు అల్లేవారు, కుమ్మరి పనులు చేసేవారి కోసం విశాఖ మున్సిపాలిటీ వంతెన కింద దుకాణ సముదాయాన్ని నిర్మించింది. నిర్మాణం పూర్తి చేసినా వాటికి కనీస మౌలిక వసతులు కల్పించలేదు. దీంతో సుమారు 50 వరకు చిన్న చిన్న దుకాణాలు ఉన్నప్పటికీ వాటికి తలుపులు, కరెంట్ లేకపోవడంతో చిరువర్తకులు ఎవరూ వాటిని తీసుకోవడం లేదు. మధ్యలో తలుపులు, తాత్కాలిక విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినా 'మూన్నాళ్ల ముచ్చట' చందంగా మారాయి. దీంతో అప్పటి నుంచి ఖాళీగానే ఉండిపోయాయి. వంతెన కిందభాగం కావడంతో లోపల చీకటిగా ఉంటుంది. గాలి, వెలుతురు సరిగా లేక నిర్మానుష్యంగా ఉంటుంది. అసాంఘిక కార్యకలాపాలు, మందుబాబుల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. జీవీఎంసీ అధికారులు ఈ దుకాణాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తే ఉపయుక్తంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

రోడ్డు మీదే వ్యాపారాలు..

దశాబ్దాలుగా వంతెన కింద దుకాణాలు పెట్టుకునే కుమ్మరి, వెదురుబుట్టలు, తట్టలు అల్లే కార్మికులు, చిరు వర్తకులు తమ వ్యాపారాలకు వేరే ఆసరా లేకపోవడంతో బ్రిడ్జికి ఆనుకుని ఉన్న రోడ్డు మీదే దుకాణాలు పెట్టుకుంటున్నారు. సమీపంలో మూడు జీవీఎంసీ పాఠశాలలు ఉండడం, ఆర్పీపేట, గవర కంచరపాలెం, పోర్టు, నావల్ డాక్‌యార్డుకు నిత్యం రాకపోకలు సాగించే వారితో రోడ్డు నిత్యం రద్దీగా కనిపిస్తుంది. బ్రిడ్జి వద్ద దుకాణాలు రోడ్డు మీదే ఉండడంతో సమస్య జటిలంగా మారుతోంది.

చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలు

వంతెన కింద చిరువర్తకుల కోసం నిర్మించిన దుకాణాలు ఖాళీగా ఉండడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. చీకటిపడగానే మద్యం సీసాలతో మందుబాబులు హల్‌చల్ చేస్తుంటారు. మద్యం మత్తులో తాగిన సీసాలను పగులగొట్టి పడేస్తుండడంతో స్థానికులకు ఇబ్బందికరంగా ఉంటోంది. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండడంతో సమీపంలో ఉన్న నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ఇక్కడి దుకాణ సముదాయాన్ని వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు. వర్తకులను దుకాణాల్లోకి పంపడం ద్వారా రోడ్డుపై ట్రాఫిక్ సమస్య కూడా ఉండదని, జీవీఎంసీకి ఎంతో కొంత ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇటువైపు దృష్టిసారించి, సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



గాలి, వెలుతురు లేని చోట నిర్మించిన దుకాణాలు

'అంబేడ్కర్ స్ఫూర్తితో పోర్టు ఆసుపత్రిని కాపాడుకుంటాం'



దీక్షా శిబిరంలో నినదిస్తున్న ఆందోళనకారులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్ స్ఫూర్తితో పోర్టు ఆసుపత్రిని కాపాడుకుంటామని సీఐటీయూ పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ వద్దని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న దీక్షలు సోమవారానికి 196వ రోజుకు చేరుకున్నాయి. నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ నిలిపేసి సొంత నిధులతో అభివృద్ధి చేయాలని పునరుద్ఘాటించారు. మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ ఆశయానికి భిన్నంగా ప్రభుత్వ రంగాలను కారుచౌకగా ప్రైవేటు వారికి ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు జక్కాన సత్యనారాయణ, కేఎస్ కుమార్ నాయుడు, శంకరరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నేడు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు పార్లమెంట్ ఆమోదించడాన్ని ఆవాజ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ప్రధాన కార్యదర్శి అశ్రఫ్ తెలిపారు. సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చట్టం రాజ్యాంగంపై, మైనార్టీల హక్కులపై దాడి చేస్తోందన్నారు. ఈ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆవాజ్ విశాఖ జిల్లా కమిటీ 15న ఉదయం 10 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తుందన్నారు. ప్రజాసంఘాలు, మేధావులు, విద్యావంతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమాఖ్య కార్యాలయం ప్రారంభం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): : ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సహకారంతో కళాంజియా సమాఖ్య సుమారు రెండు దశాబ్దాల సొంత కార్యాలయం ఏర్పాటు కల నెరవేరిందని కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ అన్నారు. గ్రేటర్ 43వ వార్డు వేంకటేశ్వర కాలనీలో నూతనంగా నిర్మించిన కైలాసగిరి కళాంజియ సమాఖ్య కార్యాలయాన్ని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. నాయకులు ఎస్.రఘునాథ్, మళ్ల లక్ష్మి, ఇజ్జు సీతారాములు, వెంకటరావు, పొదుపు సంఘాల నాయకులు ఎం.లక్ష్మి, బి.అప్పలనరసమ్మ, ధనలక్ష్మి, వై.వసంత తదితరులు పాల్గొన్నారు.

గార్బేజ్ వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

మహారాణిపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళను చెత్త తరలించే వాహనం ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సోమవారం రాత్రి సుమారు 9.45 గంటల సమయంలో ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి జగదాంబ జంక్షన్ వెళ్తున్న జీవీఎంసీ గార్బేజ్ వాహనం వెళ్తోంది. అదే రహదారిలో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చుని యల్లబిల్లి లావణ్య (27) వెళ్తోంది. సింగ్ హోటల్ జంక్షన్ వద్దకు చేరుకునేసరికి జీవీఎంసీ వాహనం ఢీకొట్టడంతో లావణ్య చక్రాల కింద నలిగిపోయి అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, డ్రైవర్ ఆళ్ళ శంకరరావును అదుపులోకి తీసుకున్నారు.

వేడుకలకు దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకుల తీరుకు నిరసన



జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట నిరసన నినాదాలు చేస్తున్న ఆ పార్టీ శ్రేణులు

మహారాణిపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొనకపోవడంతో పాటు కనీసం పార్టీ కార్యాలయం తలుపులు కూడా తెరవకపోవటంతో ఆ పార్టీ శ్రేణులు నిరసన తెలిపి వేడుకలను ఆరుబయట నిర్వహించారు. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. అంబేడ్కర్ జయంతి వేడుకలను ప్రతీ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహిస్తారు. కాని జగదాంబ సెంటర్‌లో ఉన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం తాళం తెరవలేదు. ఆ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ కస్తూరి వెంకటరావు నాయకత్వంలో ఏపీసీసీ స్పోర్ట్సు చెర్మన్ జీవీఎస్ కమలాకర్‌రావు ముఖ్య అతిథిగా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా ముఖ్యనాయకులు రాకపోవటం, పార్టీ కార్యాలయం తలుపులు తెరవకపోవటంతో ఆగ్రహించిన అభిమానులు కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం కార్యాలయం బయటే అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్లిపిల్లి సతీష్, వెస్ట్ కో-ఆర్డినేటర్ కేవీ సత్యనారాయణ, కాకార అప్పారావు, గుర్రం కనకరాజు, ఎం.సత్యనారాయణ, షరీఫ్, ఈశ్వరరావు, వెంకటేష్, వరాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో లక్ష్యసాధనకు కృషి: సీపీ



సమావేశంలో పాల్గొన్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, నిర్వాహకులు, విద్యార్థులు

సీతంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మానవ హక్కుల మండలి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి విచ్చేసి విద్యార్థులకు పలు అంశాలపై సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని, లక్ష్యసాధన దిశగా అన్ని అంశాల్లో అవగాహన పెంచుకొని ముందుకు సాగాలన్నారు. కౌన్సిల్‌కి చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

బాక్సింగ్ విజేతలకు బహుమతులు



నిర్వాహకులను సత్కరిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేన్ ఆఫ్ ఆంధ్ర (అబా) ఏడో రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల విజేతలకు సోమవారం సాయంత్రం కైలాసపురం మధుసూదన్‌నగర్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ బహుమతులను అందచేశారు. వీఎస్ విశాఖ బాక్సింగ్ అసోసియేషన్, సిటీ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 90 మంది బాక్సర్లు పాల్గొన్నారు. సుధాకర్ మాట్లాడుతూ ఆత్మరక్షణకు బాక్సింగ్ తోడ్పడుతుందని చెప్పారు. టోర్నమెంట్ విజేతలు ఈ నెల 25 నుంచి 28 వరకూ హైదరాబాద్‌లో జరిగే బీఎఫ్ఐ జాతీయ పోటీల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం నిర్వాహకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యల్లపు రఘురాం, ప్రధాన కార్యదర్శి వాసుపల్లి అమ్మోరు, ఎస్‌పీటీఈ పోర్టు వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్, పోర్టు యూనియన్ నాయకుడు గొర్లె చందు, ఐబీ శ్రీనివాస్, బి కంకరాజు, టీవీఎస్ అనిల్ కుమార్, రిఫరీలు, న్యాయనిర్ణేతలు డాక్టర్ సునీల్, సతీష్, గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.


20న అన్నమాచార్య కీర్తనల పోటీలు



పోస్టరు ఆవిష్కరిస్తున్న శేషు స్వామి, ఎం.వి.రాజశేఖర్ తదితరులు

మురళీనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ నిర్వహణలో ఈ నెల 20న అన్నమాచార్య కీర్తనల పోటీల్ని నిర్వహించనున్నట్లు సేవా సంస్థ వ్యవస్థాపకులు వి.ప్రభాకర్ తెలిపారు. మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో పోటీల నిర్వహణ విశేషాల పోస్టర్‌ను ఆలయ ప్రధాన అర్చకులు జి.శేషాచార్య స్వామి తదితరులు సోమవారం ఆవిష్కరించారు. నగరంలోని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 20న ఉదయం 10 గంటలకు పోటీలు ఆరంభిస్తామన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్ విభాగాలుగా పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనేవారు 92466 22563 ఫోన్ నంబరులో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఔత్సాహికులందరికీ ఉచితంగా ప్రవేశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, ప్రోగ్రామ్ కన్వీనర్ సత్యనారాయణరాజు, మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తాం'



సూర్యాబాగ్‌లో జెండా ఊపి వారోత్సవాలు ప్రారంభిస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి రేణుకయ్య



బర్మాక్యాంప్‌లో ప్రారంభ కార్యక్రమంలో ఏడీఎఫ్ఓ కేవీటీ ప్రసాదరావు, సిబ్బంది

మహారాణిపేట/మురళీనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ శాఖ అవగాహన వారోత్సవాలు సోమవారం ఆరంభమయ్యాయి. జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్.రేణుకయ్య సూర్యాబాగ్‌లో జెండా ఊపి అగ్నిమాపక వాహనాల ర్యాలీని ప్రారంభించారు. పెదగంట్యాడ, ఆటోనగర్, చిట్టివలసలోనూ వారోత్సవాలు ప్రారంభించారు. ప్రమాదాల్లో మరణించినవారికి నివాళులర్పించారు. ఉత్తర నియోజకవర్గంలోని బర్మాక్యాంప్ (మర్రిపాలెం) అగ్నిమాపక కేంద్రంలో ఏడీఎఫ్ఓ కె.వి.టి.ప్రసాదరావు పర్యవేక్షణలో వారోత్సవాలు ఆరంభించారు. కేంద్రంలో వాహనాలు, పరికరాల్ని ప్రదర్శించారు. విద్యా సంస్థలు, కంపెనీలు, హోటళ్ల తదితర జనసమ్మర్ద ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కేంద్రంలో జెండా ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా తొలుత ఆయనకు నివాళులర్పించారు. సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ప్రసాదరావు సూచించారు. ప్రజలకు కరపత్రాలు పంచి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

బుల్లయ్య విద్యార్థులకు సత్కారం



సత్కార కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

సీతమ్మధార, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల బీఎస్సీ లైఫ్‌సైన్స్ విద్యార్థులు సముద్ర తీరంలో గడ్డి విత్తనాలు వేసే ప్రాజెక్టు నమూనాను తయారు చేశారు. విద్యార్థులు టి.హర్షిత, ఎ.తేజాంబిక్, ఎం.అశ్విన్, కె.కార్తికేయ నారాయణ, వీరికి మెంటార్‌గా వ్యవహరించిన డాక్టర్ శైలజ, డాక్టర్ మాధవిలకు ఈ నమూనాను అమెరికాలో ప్రదర్శించే అవకాశం లభించింది. చైతన్య స్రవంతి ఎన్‌జీఓఎస్ సంస్థ, కళాశాల యాజమాన్యం సోమవారం కళాశాలలో వారిని సత్కరించారు. డాక్టర్ శిరిన్ రెహమాన్, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ఆచార్య బాలమోహన్ దాస్, ప్రొఫెసర్ రామకృష్ణారావు, డాక్టర్ చక్రవర్తి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఉక్కు ఉద్యోగుల మెడపై కత్తి

... 5వ పేజీ తరువాయి

కొత్తగా అమలులోకి తెస్తున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. తమను ఎంత వేధించాలని చూసినా కాంట్రాక్టు కార్మికుల తొలగింపును అంగీకరించబోమని, వారికి నిరవధిక సమ్మెకు అండగా ఉంటామని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. ప్రతి ఉద్యోగి రోజుకు 12 గంటలు పనిచేయాలని చెబుతున్నారని, ప్లాంటు లోపల ఉత్పత్తి సమయంలో వందల డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుందని...అటువంటిచోట్ల 12 గంటలు ఎలా పనిచేయగలుగుతామని ఆయా విభాగాల ఉద్యోగులు వాపోతున్నారు.

గ్రేటర్‌లో కాంట్రాక్టర్ హవా

... 5వ పేజీ తరువాయి

కావడంతోపాటు తమకు కూడా అన్ని విధాలుగా సహకరిస్తుండడంతో సంబంధిత అధికారి సరేనని తలూపారు. కాంట్రాక్టర్లందరికీ న్యాయం జరిగేలా ఒక్కో కాంట్రాక్టర్ గరిష్ఠంగా మూడు వర్కులు మాత్రమే చేయాలని, అంతకుమించి వర్కులు దక్కినా సరే వర్క్ ఆర్డర్ ఇచ్చేది లేదని షరతు పెడుతూ ప్రతిపాదనలను తయారుచేసి చీఫ్ ఇంజనీర్ ఆమోదానికి పంపించారు. దానిని పరిశీలించి చీఫ్ ఇంజనీర్ వివాదానికి దారితీస్తుందనే ఉద్దేశంతో పెండింగ్‌లో పెట్టినట్టు సమాచారం. ఈ వ్యవహారం జీవీఎంసీలో తెలిసిపోవడంతో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఒక కాంట్రాక్టర్ చెప్పినట్టు అధికారులు చేయడం ఆశ్చర్యంగా ఉందని, కాంట్రాక్టర్ల మధ్య పోటీ తగ్గిపోతే తక్కువ లెస్‌లకు వర్కులు వెళ్లిపోవడం వల్ల నగర పాలక సంస్థకు నష్టం జరుగుతుందని అంటున్నారు.

టీచర్ల బదిలీలకు రంగం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

జాబితాపై అభ్యంతరాలు తెలిపేందుకు ఈ నెల 19వ తేదీ గడువిచ్చారు. అభ్యంతరాలు స్వీకరించిన తరువాత వాటిని పరిష్కరించనున్నారు. ఈ నెలాఖరున ఉమ్మడి జిల్లాలో హెచ్ఎం లకు బదిలీలు ఉంటాయి. ఆ తరువాత వచ్చే నెలలో పోస్టుల ఖాళీల (సుమారు 30 వరకూ ఉన్నాయి) మేరకు స్కూల్ అసిస్టెంట్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్ఎంలుగా పదోన్నతులు ఇవ్వనున్నారు. ఆ తరువాత స్కూలు అసిస్టెంట్ టీచర్ల బదిలీలు చేపడతారు. అనంతరం సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించి, వారికి బదిలీలు చేపడతారు. కాగా ఈ పర్యాయం భారీగా స్థాన చలనం కలగనున్నదంటున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2017లో భారీగా బదిలీలు జరిగాయి. అప్పట్లో బదిలీలు జరిగిన స్కూల్ అసిస్టెంట్, సెకండరీగ్రేడ్ టీచర్లంతా ఒకేచోట ఎనిమిదేళ్లు పూర్తిచేసుకున్నారు. అందువల్ల విధిగా వీరికి ఆయా చోట్ల నుంచి స్థాన చలనం కలుగుతుంది. ఈ నేపథ్యంలో 1,000 నుంచి 1,200 మంది టీచర్లకు బదిలీలు జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు అంచనా వేస్తున్నాయి.

పరీక్షల నిర్వహణ గాడిన పడేనా?

... 5వ పేజీ తరువాయి

జీపీ రాజశేఖర్ విచారణకు కమిటీని వేశారు. సైన్స్ కాలేజీ పిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు సారథ్యంలో ఏర్పాటైన కమిటీ విచారణ జరుపుతోంది. ఈ కమిటీ కొత్తవలసలోని వాగ్దేవి కాలేజీపై మాత్రమే విచారణ జరుపుతోంది. మిగిలిన కాలేజీల్లో వ్యవహారాలపై దృష్టిసారించడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 80 కేంద్రాల్లో మూడొంతుల సెంటర్లలో ఇదే తరహాలో పరీక్షలను నిర్వహిస్తున్నారు. కొత్తవలసలో మరో కాలేజీతోపాటు గజపతినగరం, తాడేపల్లిగూడెం, ఎస్.కోట, నబ్బువరం, పాయకరావుపేట, నర్సీపట్నం, అనంతపురంలోని కేంద్రాలపైనా ఆరోపణలు వచ్చాయి. గోదావరి జిల్లాల్లోని ఒక కాలేజీలో పరీక్షల నిర్వహణకు భవనాలు లేకున్నా అక్కడ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రక్షాళన చేస్తారా?

ఏయూ దూరవిద్యను ప్రక్షాళన చేయాలని పలువురు పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన సిబ్బందితో సమస్యలున్నాయని ఉన్నతాధికారులే చెబుతున్నారు. కొందరి సీట్లు మార్చాలని ఆయన కోరినా గత ఇన్‌చార్జి వీసీ పట్టించుకోలేదు. ప్రస్తుత వీసీ జీపీ రాజశేఖర్ దృష్టిసారిస్తే మరిన్ని వ్యవహారాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు.

వైసీపీకి బెహరా గుడ్‌బై

... 5వ పేజీ తరువాయి

ప్రస్తుతం 73 మంది బలమే ఉండడంతో పాటు తమతో ఉన్న కొందరి తీరుపై నేతలకు అనుమానాలు ఉండడంతో మరింత మంది మద్దతు కూడగట్టుకోవాలని నిర్ణయించారు. అందులో భాగంగానే బెహరా భాస్కరరావుతో కూటమి నేతలు గతకొద్దిరోజులుగా సంప్రతింపులు జరుపుతున్నారు. టీడీపీలో ఆయన్ను చేర్చుకునేందుకు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అభ్యంతరం చెప్పడంతో జనసేనలోకి తీసుకోవాలని నిర్ణయించినట్టు ప్రచారం జరిగింది. జనసేనలో చేరాలంటే తనకు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించాలని బెహరా షరతుపెట్టినట్టు సమాచారం. అందుకు జనసేన పశ్చిమ నియోజకవర్గ నేతలు ససేమిరా అనడంతో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ గత రెండు రోజులుగా బెహరాతోపాటు జనసేన అధిష్ఠానంతో చర్చలు జరిపారు. ఇవి సోమవారానికి ఒక కొలిక్కి రావడంతో బెహరా వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో బెహరా కుటుంబంలోని ఇద్దరు కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయనున్నారు. దీంతో కూటమి నేతలు ఊపిరిపీల్చుకుంటున్నారు.


సీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాంట్రాక్టు కార్మికులను తొలగించవద్దని వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని కోరుతూ సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతికి వైఎస్సార్‌టీయూసీ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ప్లాంట్ స్థాపన నుంచి ఇప్పటివరకు కాంట్రాక్టు కార్మికులు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని, ఇటీవల కొంతమందిని విధుల నుంచి తప్పించడం భావ్యం కాదన్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీజీఎంను కలిసిన వారిలో నాయకులు దాలినాయుడు, శ్రీను, యల్లాజీ, పైడిరాజు, తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జనరల్ ఆస్పత్రి బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఉక్కు డీజీఎం లీనా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా ఈ ప్రాంతంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి వాహనదారులకు, ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. రెండు నెలల పాటు ఈ చలివేంద్రం ద్వారా మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, కార్మిక నాయకులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రామ అప్పారావుకు సత్కారం

అగనంపూడి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటంతో పాటు సేవా కార్యక్రమాలు చేపడుతున్న వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ పట్టా రామఅప్పారావును సోమవారం విశాఖ దళిత సంఘం నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ఎంతోమందికి ప్రమాద బీమా ఇప్పించడంతో పాటు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నిమ్మకూరి రమేష్, సుశీల గజేంద్రరావు, ఎం.ఉమామహేశ్వరరావు, పి.వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

పెందుర్తి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం పెందుర్తిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను ఆధ్వర్యంలో సరిపల్లి భీమారావు యువజన సేవా సంఘం సహకారంతో నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించిన శిబిరంలో 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. దాతలకు ధ్రువ పత్రాలను అందజేశారు. రక్తాన్ని రోటరీ బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. కార్యక్రమంలో సిరిమల్లె గణేశ్, రమేశ్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **జాక్ :** జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **రాబిన్‌హుడ్ :** శ్రీ లీలామహల్, గోకుల్,
- **మ్యాడ్ :** జగదాంబ, శరత్, కన్య (గాజువాక),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), తాతా(తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 19, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 28, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 30 దొండకాయలు 20, బంగాళదుంపలు 17, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 34, అల్లం 48, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 62, దోసకాయలు 24, వెల్లుల్లి 100, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 24, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240


గాజువాకలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలి

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు
- పలుచోట్ల ఘనంగా బాబాసాహెబ్ జయంత్యుత్సవాలు

గాజువాక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని తెలుగుదే శం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు,ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంత్యుత్సవాలను సోమవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గాజువాక బీసీ రోడ్డు కాకతీయ జంక్షన్ వద్ద ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పల్లా ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని, అటువంటి రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ అంబేడ్కర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాస్, నాయకులు గంధం వెంకటరావు, ప్రసాదుల శ్రీనివాస్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, తదితరులు, పాల్గొన్నారు. అలాగే వందడుగుల రోడ్డులో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఏజే స్టాలిన్, గాజువాకలో బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, పాత గాజువాకలో కాంగ్రెస్ నాయకుడు జెర్రిపోతు ముత్యాలు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి అంజలి ఘటించారు. గాజువాక కోర్టులో 13వ జిల్లా అదనపు జడ్జి జి.షణ్ముఖరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి.యశోద వేదమణి, న్యాయవాదులు ఈశ్వరరావు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: ఎన్ఎస్‌టీఎల్‌లో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు తీసుకువచ్చిన ఘనత అంబేడ్కర్‌దేనన్నారు. గౌరవ అతిథులు ఎం.వీ శర్మ, బాల జవహర్ పాల్గొన్నారు. ఎన్ఎస్‌టీఎల్ మహిళా కళ్యాణ్ మంచ్ అధ్యక్షురాలు బిలిన్ అబ్రహం, ఉపాధ్యక్షురాలు కృష్ణదాస్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మనసు ఆర్ఫనేజ్ హోమ్‌కు రూ.10వేలు విరాళం ఇచ్చారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్త వి.బాబుప్రసాద్, అర్బన్‌కుమార్, అమర్జీత్, దాస్, శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక లక్ష్మీనగర్, వెంకటాపురం, ఎస్సీకాలనీల్లో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 91, 92 వార్డుల్లో మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

పెందుర్తి: మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ మధుపాడ నాగమణి, గొర్లె రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, పోలీసుస్టేషన్‌లో సీఐ కేవీ సతీశ్‌కుమార్, బీసీకాలనీలో వైసీపీ నేత శరగడం చిన అప్పలనాయుడు, చినముషిడివాడలో బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, రాంపురంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష పాల్గొన్నారు.


పెందుర్తి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ఉక్కుటౌన్‌షిప్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్టీల్ ప్లాంట్ సెక్టార్-6 వద్ద గల ఆయన విగ్రహానికి ఉక్కు డైరెక్టర్లు ఏకే బాగ్చీ (ప్రాజెక్ట్), ఎస్‌సీ పాండే (పర్సనల్), ఎస్ఆర్‌వీజీకె.గణేశ్ (ఫైనాన్స్), జీవీఎన్ ప్రసాద్ (కమర్షియల్)లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మిక నాయకులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

అగనంపూడి: స్థానిక సత్రం జంక్షన్‌లో మహాత్మా గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నాయకుడు జి.పూర్ణానందశర్మ, సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నేటి యువత బాబాసాహెబ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సంస్థ ప్రతినిధులు గణపతి, రామకృష్ణ, సాయి,శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అలాగే పినమడక దళిత గ్రామీణాభివృద్ధి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దిబ్బపాలెం, కొండయ్యవలసల్లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అలాగే అగనంపూడి ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర, నాయకులు డొక్కా రమేశ్, బి.సత్యనారాయణ, జి.అప్పారావు, విందుల రాజు, బాబ్జీ, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషిచేయాలని 69వ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. తుంగ్లాం ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెట్ల అర్జున్, సీహెచ్ సూర్యనారాయణ, రమణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే బెల్ హెచ్‌పీవీపీలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏజీఎం నిరాకర్ ముండా అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అధికారులు ఎ.మధుసూదన్, జి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. మిందిలో అంబేడ్కర్ చిత్రపటానికి వైసీపీ నాయుడు గుడివాడ అప్పలరామూర్తి, హరిజన జగ్గయ్యపాలెంలో స్థానిక నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న షిప్‌యార్డు ఉద్యోగులు

పెదగంట్యాడ: ఇక్కడి బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలో గల అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను తొలగించేందుకు అంబేడ్కర్ చేసిన కృషి నిరుపమానమన్నారు. ఫైర్ స్టేషన్ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఏపీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితిలో వైసీపీ వార్డు నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ప్రగడ వేణుబాబు, ఎం.దామోదర్, దానప్ప, బి.గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని మల్కాపురంలో నిర్వహించారు. జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మల్కాపురం ఎస్సీ కాలరాం-రాంజీ సంక్షేమ సంఘం వద్ద సంఘం ప్రతినిధులు అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశనగర్ టీడీపీ కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. షిప్‌యార్డు ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. సింధియా రిక్రియేషన్ క్లబ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సంస్థ జీఎం, అశోక్‌కుమార్, ఇనయతుల్లాబేగ్, కెకోటేశ్వరరావు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్కాపురం సీఐ విద్యాసాగర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రపరచడంతో పాటు గాజువాక ఆర్టీసీ డిపో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, నివాళులర్పించారు.

సింధియా: 62వ వార్డు దుర్గానగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. 63వ వార్డు కాకరలోవ జంక్షన్లో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేశారు. సీపీఐ నేత కాండ్రేగుల సత్యాంజనేయ, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఏడీ జంక్షన్/వేపగుంట: మర్రిపాలెం ఉడా లేఅవుట్ హెల్లీ వాకర్స్ క్లబ్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రీన్ బెల్ట్ ఆవరణలో మొక్కలు నాటారు. సింహగిరి వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గోశాల జంక్షన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు.

హోమియోపతి ఆస్పత్రి భవన నిర్మాణం పరిశీలన

వేపగుంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్‌లో పునర్మిస్తున్న హోమియోపతి ఆస్పత్రి భవనాన్ని 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా సోమవారం పరిశీలించారు. జీవీఎంసీ నిధులు రూ.35.5 లక్షలతో రెండు అంతస్థుల్లో దీనిని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రెండుస్లాబ్‌ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు పూర్తి చేసి జూలైలో ప్రారంభోత్సవానికి చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట ఎర్రా నాగరాజు, శ్రీను, రాజు, శ్రీకాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల ఉద్యోగోన్నతి జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఆరిలోవ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతి జాబితాలో అభ్యంతరాలను ఈనెల 18వ తేదీన స్వీకరిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల నుంచి స్కూలు అసిస్టెంట్ల ఉద్యోగోన్నతి కోసం సబ్జెక్టుల వారీగా తాత్కాలిక సీనియారిటీ జాబితా ప్రచురించామన్నారు. అభ్యంతరం తెలిపే ఉపాధ్యాయుల పేర్లు, ప్రస్తుత కేడర్, ఎక్కడ పని చేస్తున్నారు. తదితతర వివరాలు 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీఈవో కార్యాలయంలో తెలియజేయాలన్నారు. డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచిన సంబంధిత ఫార్మాట్‌లో అభ్యంతరాలు తెలియజేయాల్సి ఉంటుందని, జాబితాలో తప్పులు ఎక్కడున్నాయో స్పష్టంగా పేర్కొనాలని, ఆధారాలు జత చేయాలన్నారు. గడువు తరువాత అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోమన్నారు.

19 వరకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు..

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ జోన్ పరిధిలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్ నుంచి గజిటెడ్ గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగాన్నతి కోసం రూపొందించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను 'ఆర్‌జేడీఎస్‌ఈవీఎస్‌పీ.కామ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకుడు బి.విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై ఈనెల 19 సాయంత్రంలోగా ఆధారాలతో అభ్యంతరాలు తెలపాలని కోరారు.

దేశం పట్ల ప్రేమాభిమానాలుండాలి : ఎమ్మెల్యే గణబాబు



మాజీ సైనికులు, దివంగత సైనికుల సతీమణులను సన్మానించిన ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల సతీమణులు , మాజీ సైనికులను సన్మానించడం ఆనందంగా ఉందని ప్రభుత్వ విప్, ఎ మ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. శ్రీహరిపురంలోని వైష్ణవి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం అఖిల భారత పూర్వ సైనిక్ సేవా పరిథ్ ఆధ్వర్యంలో జరిగిన ఆజాద్ హిందూ ఫౌజ్ దివస్‌లో ఆయన పాల్గొన్నారు. దేశం పట్ల అందరికీ ప్రేమభిమానాలు ఉండాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వాల్తేరు రైల్వే అంతర్గత ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న అంతర్గత ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ సోమవారం ప్రారంభమైంది. రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ పోటీలకు ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత ఎన్.ఉష ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు రైల్వే ఫుట్‌బాల్ ప్రతినిధులు శ్రీనివాసరావు, తిరుమలరావు, గణేష్, రాజన్న, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు జరిగిన తొలి మ్యాచ్‌లో క్యారేజ్ అండ్ వ్యాగన్స్ (సీ అండ్ డబ్ల్యు) 3-0 గోల్స్ తేడాతో ఎలక్ట్రికల్ జనరల్‌పై విజయం సాధించారు. మరో మ్యాచ్‌లో ఇంజనీరింగ్ 2-0 గోల్స్‌తో డీజిల్ లోకోషెడ్‌పై గెలుపొందింది.

సర్వీసు రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు

- భయాందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు
- పట్టించుకోని పోలీసులు

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ, షీలానగర్ వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వీసు రోడ్డులో భారీ వాహనాలు ప్రవేశించకూడదన్నని నిబంధన కానీ దీనిని పట్టించుకోకుండా వేగంగా ప్రయాణిస్తుండడంతో ద్విచక్ర వాహన చోదకులు, ఆటోవాలాలు భయం గుప్పిట రాకపోకలు సాగిస్తున్నారు. జాతీయ రహదారిపై నాలుగు రోడ్లు ఉన్న చోట మధ్యలోని రెండు ప్రధాన రహదారుల్లోనే ఆర్టీసీ బస్సులు, లారీలు తదితర భారీ వాహనాలు ప్రయాణించాలి. రెండు వైపులా వున్న సర్వీస్ రహదారులలో ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. అత్యవసర సమయాల్లో మినహా ఈ రోడ్డులో బస్సులు, లారీలను అనుమతించరు. కానీ బీహెచ్‌పీవీ సిగ్నల్ పాయింట్ల వద్ద కొద్దిగా ట్రాఫిక్ నిలిస్తే చాలు గాజువాక నుంచి వచ్చే భారీ వాహనాలను సర్వీసు రోడ్డులోకి మళ్లిస్తున్నారు. ఎన్ఏడీ నుంచి వచ్చే వాహనాలను విశాఖ డెయిరీ వద్ద సర్వీసు రోడ్డులో అమితవేగంతో దూసుకువస్తున్నాయి. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని పోలీసులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సిగ్నల్ పాయింట్ వద్ద పలువురు పోలీసులు హెచ్చరించినా భారీ వాహన డ్రైవర్లు పట్టించుకోవడం లేదంటున్నారు. సర్వీసు రోడ్డులోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బీహెచ్‌పీవీ సిగ్నల్ వద్ద సర్వీస్ రోడ్డులో వస్తున్న లారీ, ఆర్టీసీ బస్సు


బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో జాయింట్ సెక్రటరీ సంజయ్‌రాయ్, తదితరులు

'ఉక్కు'ను సందర్శించిన జాయింట్ సెక్రటరీ

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటును ఉక్కు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సంజయ్‌రాయ్ సోమవారం సందర్శించారు. ప్లాంటులోని ప్రధాన యూనిట్లను ఆయన పరిశీలించారు. బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో ఉత్పత్తి ప్రక్రియను పర్యవేక్షించడంతో పాటు మరింత అధికంగా ఉత్పత్తి చేసి ప్లాంటును ప్రగతిపథంలోకి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. స్టీల్ ప్లాంట్ ఉత్పత్తులకు మంచి పేరుందని, ఉద్యోగులు సమష్టిగా పని చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు.

దుర్గమాంబ జాతర వాల్ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరించిన ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డొంకాడ, ఉక్కు నిర్వాసిత కాలనీ ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంతా వారు మాట్లాడుతూ ఈ నెల 16న కోటి దీపాల జాతర, అమ్మవారి తొలేళ్ళు, 17న అనుపోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. జాతర సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వైభవంగా పెంటమాంబ అనుపోత్సవం


హోమంలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

పెదగంట్యాడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం నెల్లిముక్కు శ్రీపెంటమాంబ అనుపోత్సవాన్ని సోమవారం ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హోమంలో పాల్గొన్నారు. కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, గంధం శ్రీనివాసరావు, దల్లి గోవిందరెడ్డిలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పెంటమాంబ ఆలయ ఆవరణలోని గల శ్రీదుర్గమాంబ, మహాశక్తి, భూలోకమాంబ, కుంచుమాంబ, మరిడిమాంబలకు కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కాగా సాయంత్రం అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, ఘటాలను వివిధ రకాల వేషాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ నెల్లిముక్కు జంక్షన్, సీతానగరం, పెదగంట్యాడ కూడలి, బీసీ రోడ్డు, మహాత్మాగాంధీ జంక్షన్ మీదుగా పెంటమాంబ ఆలయం వరకు ఊరేగించారు రాత్రికి పలుచోట్ల పద్య నాటకాలను ప్రదర్శించారు. సినీ సంగీత విభావరి, హాస్యవల్లరి, బాణసంచా కాల్పులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా న్యూపోర్టు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

అగనంపూడి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 89వ వార్డు పరిధి జాబిలి హిల్స్‌లోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకాలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకురాలు జి.కనకభవానీ, ఆలయ కమిటీ ప్రతినిధులు సూర్యనారాయణ, సాయిరామ్, జయ, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

పెందుర్తిరూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీ బస్టాండ్ కూడలిలోని వీరాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు సోమవారం ప్రారంభయ్యాయి. ఆలయాన్ని మరింత వెడల్పు చేయనున్నారు. పోర్లుపాలెం ఆంధ్రా సిమెంట్ కంపెనీ పనిచేసే 38 మంది కార్మికులు మూడు దశాబ్దాల క్రితం సొంత నిధులతో ఆలయం, సామాజిక భవనం, నాలుగు దుకాణాలు, గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. అయితే గర్భ గుడి ఇరుకుగా ఉండడంతో పూజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో గుడిని ఆనుకొని ఉన్న రెండు దుకాణాలను కలిపి విస్తరణ పనులు చేపట్టారు. క్రేన్ సహాయంతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని బయటకి తీసి పనులు పూర్తైన తర్వాత పునః ప్రతిష్ఠ చేయనున్నారు.

నందమూరి నగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్


వాహన రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ అప్పలనాయుడు

గోపాలపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 92వ వార్డు నందమూరినగర్‌లో పోలీసులు సోమవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు కాలనీలోని ప్రతి ఇంటా తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు అప్పలనాయుడు, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచవ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

పోరాట యోధుడు అంబేడ్కర్




అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

- కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్
- ఘనంగా డా.బి.ఆర్.అంబేడ్కర్ జయంతి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహిళలు, కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శ్లాఘించారు. అట్టడుగు వర్గాల కుటుంబంలో పుట్టి మహోన్నతుడిగా ఆయన ఎదగడానికి కారణం విద్య ఒక్కటే కాదని, దానికి తోడు కార్యసిద్ధి కూడా ఉందన్నారు. అలాంటి వ్యక్తిని ఈ పుడమి ఉన్నంతవరకు గుర్తుంచుకోవాలన్నారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ కూడలి వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యుదయానికి అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించి వారి ఉన్నతికి ఎనలేనికృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జంతు ప్రదర్శనశాలలో 27 కొత్త అతిథులు



సాంబారులు నీల్గాయి



పిల్లతో నీల్గాయి



మౌస్ డీర్

ఆరిలోవ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో 27 కూనలకు ఇటీవల వివిధ జంతువులు జన్మనిచ్చాయని క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. అతి చిన్న జంతువైన ఓ మౌస్ డీర్ కూనకు జన్మ నిచ్చింది. రెండు బార్కింగ్ డీర్ కూనలు, మూడు నీల్గాయి కూనలు, ఐదు సాంబారు కూనలు, ఏడు స్పాటెడ్ డీర్ కూనలు, తొమ్మిది బ్లాక్ బక్స్ పిల్లలు పుట్టినట్లు క్యూరేటర్ పేర్కొన్నారు. అనీ ఆరోగ్యంగా ఉన్నాయని ఆమె తెలిపారు. అతి చిన్నదైన మౌస్ డీర్ శరీరం పొడవు 50 నుంచి 60 సెంటీమీటర్లు ఉంటుంది. ఇది మూడు నుంచి నాలుగు కిలోల బరువు ఉంటుంది. ఆడ జింకలు మగ జింకలకన్నా పెద్దగా, గోధుమ రంగులో ఉంటాయని, వీటి శరీరంపై మూడు నుంచి నాలుగు తెల్లని చుక్కలు ఉంటాయని మంగమ్మ వివరించారు. ఇవి చూడడానికి అందంగా ఉంటాయని, జింకల మాదిరి కొమ్ములు ఉండవని తెలిపారు. ఈ జంతు ప్రదర్శనశాలలో అరుదైన జంతువుల సంతానోత్పత్తి జరుగుతోందని, జూ సిబ్బంది, వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణ ఇందుకు దోహదపడిందని తెలిపారు.

నేడు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి పండగ

- పెదవాల్తేరు, ఎంవీపీలో ట్రాఫిక్ మళ్లింపు



విద్యుత్ దీపాలతో ప్రకాశిస్తున్న ఆలయం (ఇన్‌సెట్‌లో) పోలమాంబ

పెదవాల్తేరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పెదవాల్తేరులో కొలువైన కరకచెట్టు పోలమాంబ వార్షిక జాతర మహోత్సవాల సందడి 14 గ్రామాల్లో కనిపిస్తోంది. పెదవాల్తేరు, చినవాల్తేరు, శివాజీపాలెం, నక్కావానిపాలెం, రేసపువానిపాలెం, పీతలవానిపాలెం, ముప్పలవానిపాలెం, మూలపాలెం, వాసవానిపాలెం, జాలరి ఎండాడ, జోడుగుళ్లపాలెం, వెంకోజీపాలెం తదితర ప్రాంతాల్లోని వీధులన్నీ పండుగ తోరణాలతో కళకళలాడుతున్నాయి. మత్స్యకార గ్రామాలైన పెదజాలరిపేట, వాసవానిపాలెం, మూలపాలెం, అప్పుఘర్‌లలో ముఖ్య రహదారులు విద్యుత్ అలంకరణలతో ధగధగలాడుతున్నాయి. బంధుజనం రావడంతో ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. పండుగ సందర్భంగా మంగళవారం పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. వారికి సేవలందించేందుకు సంసిద్ధంగా ఉన్నామని ఉత్సవ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తెలిపారు. తాగునీరు, మజ్జిగ, ఇతర పానీయాలు, పులిహోర ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. పెదవాల్తేరు, అప్పుఘర్ తదితర ప్రాంతాల్లో ఆర్కెస్ట్రాలు, డాన్స్ బేబీ డాన్స్, కూచిపూడి నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి. కాగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు మూడో పట్టణ సీఐ పైడిరాజు తెలిపారు. ఎంవీపీ జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద రద్దీని దృష్టిలో ఉంచుకుని మంగళవారం ఆర్టీసీ బస్సులను సిరిపురం నుంచి చినవాల్తేరు మీదుగా మళ్లించేలా చర్యలు తీసుకుంటున్నారు. పెదవాల్తేరు, సిరిపురం రహదారిలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద, పెదవాల్తేరు జంక్షన్‌లోను, రామలక్ష్మి అపార్ట్‌మెంట్స్ వద్ద స్టాపర్స్ ఏర్పాటు చేసి వాహనాలను దారి మళ్లించనున్నట్లుపోలీసులు తెలిపారు. దొంగలు చేతివాటం ప్రదర్శించకుండా నిఘా పెట్టినట్లు త్రీటౌన్ సీఐ పి.పైడిరాజు తెలిపారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో కె.గాయిత్రి తెలిపారు. ఆలయం వద్ద 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా విజేతకు చెక్కు అందజేత

- తొలి బహుమతిగా బైక్ సొంతం చేసుకున్న వీవీఎస్ మోహిత్



విజేత మోహిత్‌కు చెక్కు అందిస్తున్న బ్రాంచి మేనేజర్ కె. రామకృష్ణారావు

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట రెండు రాష్ట్రాల్లోని 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు కోటి రూపాయల విలువైన బహుమతులతో నిర్వహించిన కార్‌అండ్ బైక్ రేస్ విజేతలకు యాజమాన్యం బహుమతులను అందిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈరేస్‌లో తొలి స్థానంలో నిలిచి, మోటార్ బైక్‌ను సొంతం చేసుకున్న అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన వీవీఎస్ మోహిత్, అతడి తల్లి రేణుకకు సోమవారం 'ఆంధ్రజ్యోతి' బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు చెక్కును అందించారు.విజేతగా నిలిచి చెక్కు సొంతం చేసుకోవడంపై మోహిత్, తల్లి రేణుక ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్క్యులేషన్ విభాగం డీసీఎం బీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. గత నెల 29న సంస్థ కార్యాలయంలో లక్కీ డ్రా తీసిన విషయం తెలిసిందే.

వైజాగ్ వాసులు అల్లుడిలా చూస్తారు

- సినీ నటుడు నాని



మాట్లాడుతున్న హీరో నాని

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): 'జనం మధ్య ఉంటే అర్జున్... మృగాల మధ్య ఉంటే సర్కార్... వైజాగ్‌లో ఉంటే అల్లుడు' అనే డైలాగులతో నేచురల్ స్టార్ నాని ప్రేక్షకులను అలరించారు. నాని లీడ్ రోల్‌లో దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కించిన హిట్-3 సినిమా ట్రైలర్‌ను సోమవారం సంగం సినిమా థియేటర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాని పలు విషయాలను అభిమానులతో పంచుకున్నారు. పెళ్లికి ముందు ఓ అమ్మాయిని కలిసేందుకు వైజాగ్ వచ్చేవాడినని, ఆ తర్వాత ఆ అమ్మాయినే పెళ్లి చేసుకున్నానంటూ వ్యక్తిగత రహస్యాన్ని బయటపెట్టారు. అప్పుడైనా, ఇప్పుడైనా వైజాగ్‌కు వచ్చింది ప్రేమ కోసమే అని పేర్కొన్నారు. ఎక్కడికి వెళ్లినా తనను సోదరుడిలా చూస్తారు.. కానీ వైజాగ్‌లో మాత్రం అల్లుడిగా చూస్తారంటూ వైజాగ్‌తో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. హిట్-3 సినిమా మంచి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కొత్త ప్రయత్నాలు చేసిన ప్రతిసారి తెలుగు ప్రేక్షకులు ఆదరించారన్నారు. హిట్-3లో మనకు అలవాటు లేని కొత్త టోన్ ఉంటుందని చెప్పారు.

'భూమాత' ఎస్‌వీఎన్ స్వప్నలోక్ గ్రాండ్ కస్టమర్ మేళా



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న భూమాత ఎండీ తాళ్ళూరి పూర్ణచంద్రరావు, డైరెక్టర్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భూమాతగ్రూప్, ఎస్‌వీఎన్ సంయుక్తంగా విజయనగరం జిల్లా తాటిపూడి వద్ద సుమారు 200 ఎకరాల్లో వేసిన వెంచర్ ఎస్‌వీఎన్ స్వప్నలోక్ వద్ద గ్రాండ్ కస్టమర్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా భూమాత మేనేజింగ్ డైరెక్టర్ తాళ్ళూరి పూర్ణచంద్రరావు, ఎస్‌వీఎన్ గ్రూపు చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ 200 ఎకరాల్లో ఐదు ఫేజ్‌లలో వుడా అనుమతితో 1,650 ప్లాట్లు అందరికీ అందుబాటు ధరల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. మేళాకు విశేష స్పందన వచ్చిందని, మూడు వేల మందికి పైగా వినియోగదారులు పాల్గొన్నారని, 400 ప్లాట్లు అమ్ముడయ్యాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ చరిత్రలో ఎవరూ ఇవ్వలేని సౌకర్యాలు ఈ వెంచర్‌లో అందిస్తున్నామన్నారు. క్లబ్‌హౌస్, స్విమ్మింగ్‌పూల్‌తో పాటు విశ్రాంతి,వినోదం అందించే బీచ్ ప్రీమియం రెసిడెన్షియల్ మెగా ప్రాజెక్టుగా తీర్చిదిద్దామన్నారు. ఈ వెంచర్‌లో ప్రపంచంలో ఏడు వండర్స్ కళాకృతులు అమర్చామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తాళ్ళూరి శివాజీ, సంస్థ ప్రతినిధులు కిరణ్‌శంకర్, గోపాల్, మార్కెటింగ్ సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు భూమాత ఎస్‌వీఎన్ స్వప్నలోక్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

జియాన్ కేంద్రంపై కేసు నమోదు

పెందుర్తి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడలోని జియాన్ పరీక్ష కేంద్రంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేంద్రంలో గత శుక్రవారం నిర్వహించిన భారత్ హెవీఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (భెల్) ఆన్‌లైన్ పరీక్ష పత్రం లీకైందని, మాస్ కాపీయింగ్ జరిగిందని ఆరోపిస్తూ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. అడ్మిట్ కార్డు వెనుక 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు సమాధానాలు ప్రింట్ కావడంతో ఆధారాలను పోలీసులకు అందజేశారు. పరీక్ష పరిశీలకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేవీ సతీశ్‌కుమార్ జియాన్ కేంద్రంపై 8,9,10 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యం

- వెలికితీసిన ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్, స్థానికులు



వెలికి తీసిన మృతదేహాలు

అనంతగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రం సరియా జలపాతం వద్ద ఆదివారం గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు సోమవారం లభ్యమయ్యాయి. విశాఖపట్నానికి చెందిన ఇద్దరు యువకులు గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం అరకు సీఐ హిమగిరి, తహసీల్దార్ మాణిక్యం, ఎస్‌ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టారు. యువకులు గల్లంతైన ప్రదేశం లోతు ఎక్కువగా ఉండడంతో మృతదేహా ల వెలికితీతకు శ్రమించాల్సి వచ్చింది. లభ్యమైన తరువాత పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పూర్ణామార్కెట్ పండావీధికి చెందిన ఈలా వాసు(21) ఫ్లిప్‌కార్ట్ డెలివరీ బాయ్ అతని తండ్రి ఆటో డ్రైవర్. ఏవీఎన్ కళాశాల సమీపంలోని రెల్లివీధికి చెందిన వడ్డాది సత్యనరసింహమూర్తి(24) కూలి. వీరితో పాటు మరో నలుగురు సరియా జలపాతాన్ని తిలకించేందుకు కారులో వచ్చారు. ఈలా వాసు పుట్టిన రోజు ఈ నెల 6న కావడంతో 13న జలపాతం వద్ద వేడుకలు చేసుకుందామని భావించారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. తిరిగి వెళ్లే సమయంలో వాసు, సత్యనరసింహమూర్తి ప్రమాదవశాత్తూ జలపాతం వద్ద జారిపడ్డారు. కేజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. చేతికి అందివచ్చిన కుమారులు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.